
MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 331 | పేజీలు : 8 | శుక్రవారం 20 నవంబర్ 2026 | వెల : 6-00



రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్

కట్టుదిట్టంగా మూడు ప్రాంతాల ఆర్థిక ప్రణాళికలను అమలు

- భారీ ప్రాజెక్టులకు ఎంఎస్ఎంఈల అనుసంధానం
- ప్రతి పారిశ్రామిక క్లస్టర్‌కూ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలి
- పారిశ్రామిక అవసరాలకు ల్యాండ్ బ్యాంక్... అవసరమైతే నూతన పాలసీ
- సైబరాబాద్ తరహాలో వైజాగ్ బే-టెక్ సిటీ
- సూర్యలంక, గండికోటలకు టూరిజం మాస్టర్ ప్లాన్
- విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనామిక్ రీజియన్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

అమరావతి, మహానగర్

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల ప్రణాళికలు అభివృద్ధికి బ్లూప్రింట్ వంటివని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలపై అధికారులు రూపొందించిన ప్రణాళికలపై ముఖ్యమంత్రి ఒకేసారి సమీక్ష నిర్వహించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ మూడు ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళికల్లో ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే గుర్తించి భర్తీ చేయాలని, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు రావడం, పెట్టుబడులు పెట్టడం మాత్రమే అభివృద్ధి కాదని.. వాటి ద్వారా రాష్ట్ర ప్రజల ఆదాయాలు పెరగాలని, జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి తలసరి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని... దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. ప్రతి ప్రాంతానికి ఉన్న - మిగతా2లో

5



వచ్చే 20 ఏళ్ల పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'!

- పరిశ్రమలకు ప్రధాని మోదీ కీలక పిలుపు
- వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెంచండి..
- స్వదేశీ ఉత్పత్తుల నాణ్యతతో ప్రపంచ మార్కెట్లను గెలవండి
- ఉద్యోగుల వేతనాలు పెంచుతున్నారా?
- పన్ను రాయితీల ప్రయోజనాలు కార్మికులకూ అందాలి




భారత ప్రజాస్వామ్యం పవిత్రమైనది

- ఎన్నికలను బహిష్కరిస్తే అంతం: రాహుల్ గాంధీ
- ఓటములు ఎదురైనా పోరాటం ఆపేది లేదు..
- ఎన్నికల వ్యవస్థలో లోపాలపై ప్రజలకు వివరిస్తాం
- మోదీ సర్కారుపై జైరాం రమేశ్ విమర్శలు..



గ్రూప్ రిజర్వేషన్లపై బెర్తుల పరిమితి తొలగింపు

- రైల్వే కొత్త నిబంధనలు
- బల్క్ టికెట్ల బుకింగ్ నిబంధనలను సవరించిన సౌత్ వెస్ట్రన్ రైల్వే
- గ్రూప్ బుకింగ్స్‌కు గరిష్ఠ బెర్తుల పరిమితిని పూర్తిగా ఎత్తివేత
- స్టేషన్ మేనేజర్లు, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్లకే అనుమతి ఇచ్చే అధికారం



బర్డ్‌ఫ్లూ కట్టడికి స్వదేశీ వ్యాక్సిన్

- భారత్ శాస్త్రవేత్తల కీలక ముందడుగు!
- హెచ్5ఎన్1 వైరస్‌ను ఎదుర్కొనేందుకు తొలి దేశీయ టీకా అభివృద్ధి
- నవంబర్ 20న దేశానికి అంకితం చేయనున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

తీరానికి దూసుకొస్తున్న అక్వాన్ తీవ్ర తుపాను

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వేగంగా కదలిక..

రేపు మధ్యాహ్నం నర్సాపూర్--పూరీ మధ్య తీరం దాటే అవకాశం

గంటకు 100 కి.మీ. వేగంతో ప్రచండ గాలులు..

ఏపీ, ఒడిశా తీర ప్రాంతాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ 2





5

డిసెంబర్ 2న మూడో దశ పంచాయతీ ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం..
- ఈ నెల 21 నుంచి నామినేషన్ల స్వీకరణ
- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న నామినేషన్ల పరిశీలన.. 27న ఉపసంహరణకు గడువు
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్
- అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

2లో

సమగ్ర కుల గణనకు వైసీపీ మద్దతు

2027 జనాభా లెక్కల్లో బీసీ, ఓబీసీలకు ప్రత్యేక కులం కాలమ్ చేర్చాలి: వైఎస్ జగన్



అమరావతి, మహానగర్

సమగ్ర కుల గణన చేపట్టాలన్న డిమాండ్‌కు వైఎస్సార్‌సీపీ పూర్తి మద్దతు ప్రకటించింది. సామాజిక న్యాయం సాధించాలంటే కచ్చితమైన కుల, ఆర్థిక గణాంకాలు అవసరమని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 2027 జనాభా లెక్కల్లో కుల గణనకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆల్ ఇండియా కుల గణన సమన్వయ కమిటీ ప్రతినిధి బృందం గురువారం తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసింది. 2027 జనాభా లెక్కల్లో కుల గణన అంశాలు, దీనికి సంబంధించిన ఆందోళనలు, డిమాండ్లపై ఆయనతో చర్చించింది. అనంతరం ప్రతినిధి బృందం చేసిన ప్రతిపాదనలను వివరిస్తూ జగన్ సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. 2027 జనాభా లెక్కల్లో బీసీ, ఓబీసీల కోసం సంబంధిత రాష్ట్రాల్లో ప్రత్యేక కుల నమోదు కాలమ్‌ను తప్పనిసరిగా చేర్చాలని సమన్వయ కమిటీ కోరింది. కుల గణనలో ఏ కులం కూడా మిగిలిపోకుండా సమగ్ర కులాల ఎంపిక జాబితాను అందుబాటులో ఉంచాలని సూచించింది. - మిగతా2లో

భారత్-జపాన్ బంధం మరింత బలోపేతం!

- రక్షణ రంగంలో కీలక ఒప్పందాలకు వేగం
- 'యూనికార్న్' ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి
- స్టెల్త్ మాస్ట్ సాంకేతికత అభివృద్ధికి సహకారం..
- సముద్ర భద్రత, నౌకాదళ ఆధునికీకరణపై కీలక చర్చలు

5లో

రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేకతలు, వనరులు, అవకాశాలను వినియోగించుకుంటూ రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ అవసరమైన మేరకు మార్పులు చేయాలని సూచించారు. మూడు రీజియన్లల్లో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూడు ప్రాంతాల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికల అమల్లో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కచ్చితంగా ఉండేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ప్రణాళికల అమల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే... ఆ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధుల సహకారం కూడా తీసుకుని ప్రభుత్వం యంత్రాంగం పని చేయాలని సూచించారు. అలాగే ఈ ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియ చేయడంతోపాటు... వివిధ రూపాల్లో వారినీ భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సిటీ ఎకనమిక్ రీజియన్ స్కీం కింద 60 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,180 కోట్లతో సిద్ధం చేసి ప్రతిపాదనలను కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

పోర్టు ఆధారిత పరిశ్రమలతో అభివృద్ధి

విశాఖపట్నం ఎకనమిక్ రీజియనల్ ప్రణాళికలో భాగంగా యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతానికి విశాఖ బే-టెక్ సిటీ అని పేరు పెట్టారు. వివిధ పేర్లను పరిశీలించిన అనంతరం సీఎం చంద్రబాబు విశాఖ బే-టెక్ సిటీ పేరును ఖరారు చేశారు. హైదరాబాద్ నగరంలో సైబరాబాద్ పేరుతో ఓ నగరాన్ని అభివృద్ధి చేసినట్టుగానే బే-టెక్ సిటీ పేరుతో విశాఖకు అనుబంధంగా మరో నగరాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అలాగే వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో నగర మేయర్‌కు చోటు కల్పించాలని సీఎం సూచించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో వివిధ విభాగాలకు సంబంధించి 167 ప్రాజెక్టులకు గానూ... 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చాయని సీఎం వివరించారు. విశాఖకు చెరో వైపు ఉన్న విజయనగరం, అనకాపల్లి వైపు అభివృద్ధి జరుగుతోందని... ఆ ప్రాంతాల్లో అవసరమైన మేరకు ముందుగానే భూమిని గుర్తించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. అలాగే తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూ లభ్యత తక్కువగా ఉంటుందని... దీనివల్ల పారిశ్రామికాభివృద్ధికి కొంత ఇబ్బంది ఉందన్నారు. ఈ మేరకు ఈ జిల్లాల్లో కూడా ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. దీనికోసం అవసరమైతే పాలసీ తీసుకురావాలని అధికారులకు సూచించారు. విశాఖలో ఏడాదిలోగా కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలని, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అందులోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోర్టుల ఆధారిత ఆర్థిక వ్యవస్థకు విస్తృత అవకాశాలున్నాయని, పరిశ్రమలకు అవసరమైన లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాల అనుసంధానాన్ని మెరుగుపరిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి పారిశ్రామిక ప్రాంతం వద్ద అవసరమైన నివాస, విద్య, వైద్యం, రవాణా సదుపాయాలతో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు.

నాలెడ్జ్ పార్టనర్లుగా ప్రముఖ విద్యా సంస్థలు

తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని సాంకేతిక, పారిశ్రామిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తిరుపతిని గ్లోబల్ సెమీ కండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్ల వంటి రంగాలకు అనుబంధంగా డిజైన్ పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి పారిశ్రామిక క్లస్టర్లను మరింత బలోపేతం చేయాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాల్లో ప్రధాన పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అవసరమైన విడిభాగాలు, సేవలు అందించే ఎంఎస్ఎంఈలను కూడా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడం కాకుండా, వాటి చుట్టూ స్థానికంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల నెట్‌వర్క్ ఏర్పడాలని చెప్పారు. ముఖ్యంగా పెద్ద పరిశ్రమలకు అనుసంధానించేలా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రతి రంగానికి అవసరమైన ఫుర్తి ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలన్నారు. పరిశ్రమల వ్యర్థాల్లోని విలువైన పదార్థాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశాలను పరిశీలించాలని, అరుదైన ఖనిజాల వ్యర్థాల నుంచి ఇతర అవసరాలకు ఉపయోగపడే పదార్థాలను వేరు చేసే సాంకేతికతపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చర్, ఖనిజ సంపద ఆధారంగా తిరుపతి ప్రాంతంలో కొత్త పెట్టుబడులకు అవకాశాలున్నాయని చెప్పారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో మొత్తంగా రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే... అత్యధిక శాతం గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ. 5.70 లక్షల కోట్లు వచ్చాయని సీఎం చెప్పారు. రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని.. దీన్ని మాగ్నటిక్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి సంబంధించి వచ్చిన ప్రతిపాదనలను కార్యాచరణలోకి తీసుకురావాలని, మూడేళ్లలో లక్ష్యాలను సాధించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. పెట్టుబడులు ఏయే రంగాల్లో, ఏయే ప్రాంతాల్లో వస్తున్నాయో స్పష్టంగా గుర్తించి, లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాల అనుభవాన్ని వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి ఎకనమిక్ రీజియన్లో ఆక్వా, కోకో, పామాయిల్ వంటి రంగాలు అతి పెద్ద ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని తెలిపారు. అమరావతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఇప్పటికే రూ. 4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు నడుస్తున్నాయని తెలిపారు. మచిలీపట్నం, రామాయపట్నం వంటి పోర్టులకు మంచి కనెక్టివిటీ అందిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అలాగే క్వాంటం రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అమరావతి రీజియన్ పరిధిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. క్వాంటం కారిడార్ గా అమరావతి అభివృద్ధి చెందుతుందన్నారు. క్వాంటం వ్యాలీతోపాటు... క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ రంగానికి అమరావతి కేంద్రంగా మారుతుందనన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్, ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణాలు అభివృద్ధికి కేంద్రంగా ఉంటాయని పేర్కొన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి ప్రాంతానికి ఐఐటీ, అమరావతి ప్రాంతానికి బిట్స్ పిలానీ వంటి సంస్థలతో పాటు మూడు ప్రాంతాల్లోనూ ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య నిరంతర అవగాహన, చర్చలు జరగాలని చెప్పారు. ఐఐటీయన్లు, పాన్ ఐఐటీ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

తీర ప్రాంతం... బుద్దిస్ట్ సర్క్యూట్లతో టూరిజం అభివృద్ధి

అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను ఆకర్షించేలా రహదారులు, వసతి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎం చంద్రబాబు చెప్పారు. వచ్చే సీఐఐ సదస్సు నాటికి వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులను అరకు, లంబసింగి వంటి ప్రాంతాలకు తీసుకెళ్లాలని సూచించారు. తీర ప్రాంతాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచుతూ బీచ్ రిసార్ట్సులుగా అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక, ఓడరేపు, చినగంజాం, నిజాం పట్నం, డిండి వంటి ప్రాంతాల్లో బీచ్, ఎకో టూరిజానికి అవకాశం ఉందని తెలిపారు. పర్యాటక అభివృద్ధి పేరుతో కాలుష్యానికి తావుండకూడదని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని, శ్రీశైలం సహా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని చెప్పారు. నాగార్జునకొండ, అమరావతి ప్రాంతాలను అనుసంధానిస్తూ బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి ప్రణాళికలు రచించి... ఆ మేరకు ఆ ప్రాంతాన్ని నోటిఫై చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సూర్యలంక, గండికోట ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్లు రూపొందించాలని నిర్దేశించారు. ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని, పెట్టుబడుల గ్రౌండింగ్‌పై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. వీకెండ్ ఎకానమీపై దృష్టి పెట్టాలని... వాణిజ్య, పర్యాటక, వినోద కార్యకలాపాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్లకు సంబంధించిన సీఈఓలు యువరాజ్, ముఖేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర కుల గణనకు వైఎస్సార్‌సీపీ మద్దతు

-మొదటిపేజీ తరువాయి

ప్రతి కుటుంబ ఆర్థిక స్థితిని తెలియజేసే వివరాలను కూడా నమోదు చేయాలని డిమాండ్ చేసింది.

వాస్తవ గణాంకాలతోనే సామాజిక న్యాయం

సామాజిక న్యాయం సాధించాలంటే సమగ్ర, సుస్థిర, సమాన అభివృద్ధికి వీలుగా వాస్తవ గణాంకాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని జగన్ పేర్కొన్నారు. కుల గణనకు సంబంధించి కమిటీ చేసిన డిమాండ్లు సమంజసమైనవని, వాటిని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

సంక్షేమ పథకాల అమలుకు కీలకం

వాస్తవ గణాంకాల ఆధారంగా విధాన నిర్ణయాలు తీసుకోవడానికి, సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థంగా అమలు చేయడానికి కచ్చితమైన, సమగ్రమైన, అందరినీ కలుపుకొని సాగే కుల గణన ఎంతో అవసరమని జగన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ మొదటి నుంచీ సమగ్ర కుల గణన డిమాండ్‌కు మద్దతుగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ న్యాయమైన డిమాండ్‌కు తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

తీరానికి దూసుకొస్తున్న 'అక్వాన్' తీవ్ర తుపాను

విశాఖపట్నం / అమరావతి,

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తీవ్ర తుపాను ఉత్తర దిశగా వేగంగా కదులుతోంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఈ తుపాను తీర ప్రాంతాలకు సమీపిస్తుండటంతో ఆంధ్రప్రదేశ్, యానాం, ఒడిశా తీర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తాజా బులెటిన్ ప్రకారం నవంబర్ 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం ఉత్తర ఆంధ్రప్రదేశ్--యానాం, దక్షిణ ఒడిశా తీరాల మధ్య నర్సాపూర్ నుంచి పూరీ వరకు, గోపాల్‌పూర్‌కు తూర్పు వైపున తీరం దాటే అవకాశం ఉంది. గురువారం ఉదయం 8.30 గంటల సమయానికి తుపాను కేంద్రం 14.9 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 85.3 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉంది. గత ఆరు గంటల్లో గంటకు 15 కిలోమీటర్ల వేగంతో ఉత్తరం వైపు కదిలింది. నర్సాపూర్‌కు ఆగ్నేయంగా 420 కిలోమీటర్లు, కళింగపట్నానికి ఆగ్నేయంగా 400 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు దక్షిణంగా 490 కిలోమీటర్లు, పూరీకి దక్షిణంగా 550 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించింది. తుపాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉండటంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.

తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు

తుపాను ప్రభావంతో గురువారం (నవంబర్ 19) కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నవంబర్ 20న కూడా కోస్తాంధ్రలో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవవచ్చని అంచనా వేసింది. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తెలంగాణలోనూ నవంబర్ 20, 21 తేదీల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

ఆరు జిల్లాలకు ముప్పు.. సముద్రంలో అలల ఉద్ధృతి

తుపాను తీరం దాటే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో సముద్రపు అలల ఉద్ధృతి పెరిగే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. సాధారణ సముద్ర మట్టానికి అదనంగా 0.5 నుంచి 1 మీటరు ఎత్తు వరకు అలలు ఎగిసిపడే అవకాశం ఉందని తెలిపింది. ఈ కారణంగా తీరానికి సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని పేర్కొంది. ఒడిశాలోని గంజాం, పూరీ జిల్లాల్లోనూ ఇదే తరహా పరిస్థితులు ఏర్పడవచ్చని హెచ్చరించింది.

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు

తుపాను ప్రభావంతో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్రం ఇప్పటికే అల్లకల్లోలంగా మారింది. ఈ ప్రాంతంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండగా, 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉత్తర ఆంధ్రప్రదేశ్, యానాం తీరాల వెంబడి నవంబర్ 19 అర్ధరాత్రి నుంచి తుపాను తీరం దాటే వరకు బలమైన గాలులు కొనసాగవచ్చని ఐఎండీ తెలిపింది. నవంబర్ 21 ఉదయం వరకు పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని స్పష్టం చేసింది.

అధికార యంత్రాంగం అప్రమత్తం

తుపాను నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. బలహీనంగా ఉన్న ఇళ్లలో నివసించేవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి. భారీ వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగుల సమీపంలో ఉండకూడదు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికార యంత్రాంగం సూచించే సహాయక కేంద్రాలను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

మరో తుపానుతో రైతులు, ప్రజల్లో ఆందోళన

ఇటీవలే 'అర్నబ్', 'మురాసు' తుపానుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలు వర్షాలు, వరదలు, పంట నష్టాలను ఎదుర్కొన్నాయి. ఇప్పుడు మరోసారి 'అక్వాన్' తుపాను ముప్పు ముంచుకొస్తుండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతుల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా వరి, పత్తి, ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు వాతావరణ పరిస్థితులను గమనించాలని, పంట ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే ఏర్పాట్లు చేసుకోవాలని సూచిస్తున్నారు.

రాప్తాడు బాలిక ఫైటర్.. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యం!

బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాప్తాడు బాలిక ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోంది. ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక త్వరలోనే పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వస్తుందని మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినంత మాత్రాన తన బాధ్యత ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. బాలిక మునుపటిలా నవ్వుతూ, సంతోషంగా సాధారణ జీవితం గడిపే వరకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఉండవల్లిలోని తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. బాలికకు అందుతున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలిక వేగంగా కోలుకుంటోందని వైద్యులు వెల్లడించడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

వెంటిలేటర్ అవసరం లేకుండా శ్వాస

బాలిక ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని లోకేశ్ తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్ అవసరం లేకుండానే శ్వాస తీసుకుంటోందని, నోటి ద్వారా ఆహారం తీసుకుంటోందని వివరించారు. చిన్నపాటి గాయాలకు చికిత్స కొనసాగుతోందని, ఇతరుల సహాయంతో నెమ్మదిగా నడుస్తోందని వైద్యులు వెల్లడించారు. రాయడానికి అవసరమైన శిక్షణ కూడా ప్రారంభించినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం నవ్వమని అడిగితే బాలిక చిరునవ్వు చిందించిందని



పేర్కొన్నారు.

డిశ్చార్జ్ తర్వాతా ప్రత్యేక వైద్య సంరక్షణ

బాలిక ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా వైద్య సంరక్షణలో ఎలాంటి లోటు ఉండకూడదని మంత్రి సూచించారు. స్థానికంగా మానసిక వైద్య నిపుణుడిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతపురం ఆసుపత్రి సహకారంతో ప్రత్యేక థెరపిస్ట్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంటి వద్ద ఇన్ఫెక్షన్లు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

భవిష్యత్తు చికిత్సకు సమగ్ర ప్రణాళిక

బాలికకు భవిష్యత్తులో అవసరమయ్యే శస్త్రచికిత్సలపై ముందుగానే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని వైద్యులకు సూచించారు. చికిత్సతో పాటు మానసికంగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

వైద్య బృందానికి కృతజ్ఞతలు

"బాలిక మళ్లీ తోటి పిల్లలతో కలిసి సంతోషంగా గడపాలి. తను పూర్తిగా కోలుకునే వరకు బాధ్యత తీసుకుంటాను" అని లోకేశ్ భరోసా ఇచ్చారు. బాలికను నిజమైన ఫైటర్‌గా అభివర్ణించిన వైద్యుల మాటలకు ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. బాలిక ప్రాణాలు కాపాడి, కోలుకునేందుకు కృషి చేస్తున్న వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి నుంచి ఇంటికి చేరిన తర్వాత కూడా ఆమె ఆరోగ్యం, పునరావాసంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

డిసెంబర్ 2న మూడో దశ పంచాయతీ ఎన్నికలు

అమరావతి



ఆంధ్రప్రదేశ్‌లో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన ఎస్ఈసీ.. డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపింది.

23 వరకు నామినేషన్ల స్వీకరణ

ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ నెల 21, 22, 23 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేయవచ్చు. 24వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు 27వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ఖరారు కానుంది.

ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్

డిసెంబర్ 2న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. మూడో దశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామ పంచాయతీల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసే అవకాశం ఉంది.

డిసెంబర్ 18 నుంచి 21 వరకు
రోజ్ అండ్ అగ్రి హార్టికల్చర్ షో
ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

పూల పెంపకం, ఉద్యానవనాల అభివృద్ధి, పచ్చదనం విస్తరణతో పాటు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన, ఆసక్తి పెంపొందించేందుకు రోజ్ అండ్ అగ్రి హార్టికల్చర్ షో ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న 9వ రోజ్ అండ్ అగ్రి హార్టికల్చర్ షో పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. నగర ప్రజలు, ప్రకృతి ప్రేమికులు, పూల పెంపకంపై ఆసక్తి ఉన్నవారు పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రదర్శనలో వివిధ రకాల గులాబీ పూలు, ఉద్యానవన మొక్కలు, వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు నర్సరీ మేళా, సేంద్రియ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాల్లో మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ ఉత్పత్తుల వినియోగం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శన మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోజ్ సొసైటీ అధ్యక్షురాలు కె. లక్ష్మీ తులసి, కార్యదర్శి కె. విశాల, సభ్యులు సీతా మహాలక్ష్మి, జి.ఎస్.ఆర్. మోహన్ రావు, జి.లక్ష్మి, సుమ బిందు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి బీసీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ
విజయవాడ, మహానగర్ంం

డీఎస్సీ–2026 నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న జిల్లాకు చెందిన అర్హులైన బీసీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్, విజయవాడ సంచాలకులు ఇ.జగ్గయ్య తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్ పోస్టుల నియామక పరీక్షలకు సంబంధించి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణకు టెట్‌లో ఉత్తీర్ణులైన బీసీ అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలతో కలిపి నవంబర్ 25, 2026వ తేదీలోగా బీసీ స్టడీ సర్కిల్, విజయవాడ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, టి.టి.సి. లేదా బి.ఎడ్., టెట్ మార్కుల జాబితాలు, కుల ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,00,000 లోపు ఉన్నట్లు తెలిపే ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదా తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను జతపరచాలి. దరఖాస్తులు సమర్పించాల్సిన చిరునామా: బీసీ స్టడీ సర్కిల్, డోర్ నెం. 74–2–1/5, అశోక్ నగర్, పండరిపురం, రోడ్డు నెం. 8, విజయవాడ–520007. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 8688855255, 9966849937, 9505094349. డీఎస్సీ–2026 నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన బీసీ అభ్యర్థులు ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ.జగ్గయ్య కోరారు.

పోలింగ్ జరిగే ప్రాంతాల్లో స్థానిక సెలవు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఉత్తర్వులు
విజయవాడ, మహానగర్



జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ జరిగే ప్రాంతాల్లో స్థానిక సెలవులు, వేతనంతో కూడిన సెలవులు, మద్యం దుకాణాల మూసివేతకు సంబంధించి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ రోజున స్థానిక సెలవు వర్తిస్తుందన్నారు. ఓటు హక్కు కలిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ రోజున ఓటు వేయడానికి వీలుగా పరిస్థితులను బట్టి కొంత సమయం వెసులుబాటు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలు, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు తమ ఉద్యోగులకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలని సూచించారు. సాధ్యం కాని పరిస్థితుల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ సమయంలో కనీసం మూడు గంటల పాటు పనికి విరామం కల్పించాలని తెలిపారు. దుకాణాలు, సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు కూడా వేతనంతో కూడిన సెలవు వర్తించేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో పోలింగ్ ముగిసే సమయానికి 44 గంటల ముందు నుంచే మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఎక్సైజ్, పోలీసు అధికారులు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

నిరుద్యోగ యువతకు శుభవార్త

జిల్లాలో రెండు చోట్ల జాబ్ మేళాలు
ఈ నెల 23న జగ్గయ్యపేటలో, 28న తిరువూరులో నిర్వహణ
రూ.12 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనంతో ఉద్యోగ అవకాశాలు

విజయవాడ, మహానగర్

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 23న జగ్గయ్యపేటలో, 28న తిరువూరులో జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాల్లో ఒక్కోచోట సుమారు పది ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. జగ్గయ్యపేటలోని వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న ఉదయం 9 గంటలకు, తిరువూరులోని



ఎస్ఎల్ఆర్ ప్రతిభ డిగ్రీ కళాశాలలో 28న ఉదయం 9 గంటలకు జాబ్ మేళాలు ప్రారంభమవుతాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలు కలిగి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున్న యువతీ యువకులు అర్హులని, ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా నైపుణ్యం వెబ్‌సైట్‌లో తమ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళాకు హాజరయ్యే సమయంలో రెజ్యూమ్, ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్, పాన్ కార్డు కాపీ, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు తీసుకురావాలని తెలిపారు. జిల్లా ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అధికారి సి. మధుభూషణ్ రావు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సీపాన శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జగ్గయ్యపేట జాబ్ మేళా వివరాలకు 9666815987, 9014943757, తిరువూరు జాబ్ మేళా వివరాలకు 6301534435 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలలకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వైద్యం, నైపుణ్య శిక్షణ అందించాలి

జువెనైల్ జస్టిస్ చట్ట నిబంధనలను పక్కాగా అమలు చేయాలి
బాలల సంరక్షణ కేంద్రాల్లో సదుపాయాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తనిఖీలు

విజయవాడ, మహానగర్:

బాలల సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాలలకు మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం, వైద్య సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్, జిల్లా స్థాయి కమిటీ చైర్మన్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. బాలల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేలా నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యా శిక్షణ అందించాలని సూచించారు. నగర పరిధిలోని సితార కబేలా, రైల్వే స్టేషన్, హనుమాన్‌పేట ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ బాలుర హోమ్, నవజీవన్ బాల భవన్ ఓపెన్ షెల్టర్, ఎస్‌కేపీవీ బాలల సంరక్షణ కేంద్రాలను శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. ముందుగా ప్రభుత్వ బాలుర హోమ్‌ను సందర్శించిన జాయింట్ కలెక్టర్ బాలలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆహారం, ఆరోగ్య పరిస్థితులు తదితర అంశాలపై హోమ్ సూపరింటెండెంట్ శరత్ బాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలలు ఎప్పటి నుంచి హోమ్‌లో ఉంటున్నారు, ఏయే ప్రాంతాల నుంచి వచ్చారు, వారి కుటుంబ సభ్యులు ఎవరైనా వచ్చి పరామర్శిస్తున్నారా అనే విషయాలను ఆరా తీశారు.



బాలలకు ప్రతిరోజూ ఆకుకూరలు, కూరగాయలు, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే పోషకాహారం అందించాలని, నిర్ణీత మెనూ చార్ట్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. వంటగది, నిల్వ గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రంలో బాలలు ఆటలు ఆడుకునేందుకు తగిన స్థలం, అవసరమైన ఆట వస్తువులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. బాలలందరికీ నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యా శిక్షణ అందించి, భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అనంతరం బాలలతో ముఖాముఖి మాట్లాడి, కేంద్రాల్లో కల్పిస్తున్న సదుపాయాలు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకుని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలలకు సూచిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. కేంద్రాల్లోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ జువెనైల్ జస్టిస్ చట్టం నిబంధనల ప్రకారం అన్ని రికార్డులను పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో జువెనైల్ వెల్ఫేర్ డైరెక్టర్ వసంతబాల, జిల్లా ప్రొబేషన్ అధికారి సత్యవతి, డీసీపీవో ఎం. రాజేశ్వరరావు, జువెనైల్ జస్టిస్ సభ్యురాలు బి. పుష్పలత, డాక్టర్ అమితా, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ సురేష్, ప్రభాకర్, దుర్గాప్రసాద్, జాన్సన్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీపోలింగ్‌కు తావులేకుండా ఎన్నికలను నిర్వహించాలి

ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి
బ్యాలెట్ పేపర్ల నిర్వహణ, టెండర్ ఓట్లు, ఛాలెంజ్ ఓట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్

సాధారణ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి లోటుపాట్లకు, రీపోలింగ్‌కు తావులేకుండా అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. నగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కళా వేదికలో గురువారం సాధారణ పంచాయతీ ఎన్నికల మొదటి విడత ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికల విధులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపు ఒకే రోజు నిర్వహించనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఒత్తిడి, పోటాపోటీ వాతావరణం ఉండే అవకాశం ఉందని, అధికారులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత చిత్తంతో బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం



జారీ చేసిన మార్గదర్శకాలు, ప్రామాణిక కార్యాచరణ విధానాలనన తూచా తప్పకుండా పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, ఎన్నికల నిర్వహణలో జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రిసైడింగ్ అధికారుల కరదీపికను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి దశలో అనుసరించాల్సిన విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏవైనా సందేహాలు తలెత్తితే సొంత నిర్ణయాలు తీసుకోకుండా సంబంధిత ఉన్నతాధికారుల సూచనలు తీసుకోవాలని తెలిపారు. గత ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లను సక్రమంగా మడతపెట్టకపోవడం, వేలిముద్ర సిరా అంటుకోవడం వంటి కారణాలతో కొన్ని ఓట్లు చెల్లకుండా పోయాయని గుర్తుచేశారు. ఈసారి అటువంటి పొరపాట్లు జరగకుండా ఓటర్లకు బ్యాలెట్ పేపర్ మడతపెట్టే విధానంపై ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ సమయంలో ఏజెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పుడు ప్రిసైడింగ్ అధికారులు నిబంధనల ప్రకారం ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సును ప్రిసైడింగ్ అధికారి నిరంతరం తన పర్యవేక్షణలో ఉంచుకోవాలని, ఓటర్లు బ్యాలెట్ పేపర్లను బయటకు తీసుకెళ్లకుండా, ఇతర కాగితాలను బ్యాలెట్ బాక్సులో వేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ వెనుక ముద్ర వేసే సమయంలో అధికంగా ఇంకు పడకుండా, పేపర్ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే సంబంధిత కేంద్రాలకు చేరుకుని అక్కడి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. స్థానిక పోలీసు, రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. మొదటి విడత ఎన్నికలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించి, తదుపరి విడతల ఎన్నికలకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి.సీతామహాలక్ష్మి, ఆర్డీఓ వెన్నెల శ్రీను, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి నాంచారారావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.ప్రభాకరరావు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, విజయవాడ, నందిగామ డివిజనల్ పంచాయతీ అధికారులు రాఘవన్, లక్ష్మీ కుమారి, ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్

అమెరికాలో ఉన్నత విద్య , ఆపై మంచి ఉద్యోగం.. ఇది ప్రపంచంలోని చాలా మంది డ్రీమ్. దశాబ్దాలుగా భారతీయులకు కూడా అమెరికా ఫస్ట్ చాయిస్. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి మారుతున్నట్లు కనిపిస్తోంది. వీసా అనిశ్చితులు, క్లిష్టమైన ఉద్యోగ మార్కెట్, మారుతున్న వలస విధానాల కారణంగా అమెరికాలో చదువుకోవాలనే విద్యార్థుల నిర్ణయాలు సంక్లిష్టంగా మారాయి. ఫలితంగా 2025-26 విద్యా సంవత్సరంలో అమెరికా విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య 6 శాతం తగ్గి 3,39,435కు చేరుకుంది. ఇదే సమయంలో చైనా విద్యార్థుల సంఖ్య 4 శాతం తగ్గి 2,54,458కి పరిమితమైంది.అన్నింటికంటే ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. అమెరికా విద్యాసంస్థల్లో కొత్తగా చేరుతున్న విద్యార్థుల సంఖ్య. 2025-26లో అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలు 18 శాతం పడిపోయి 2,28,123కు చేరాయి. గతంలో చేరిన మొత్తం విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే, ఈ గణాంకాలు విద్యార్థులు ఇప్పటికీ అమెరికాను ఎంచుకుంటున్నారా? లేదా? అనేదానికి స్పష్టమైన నిదర్శనంగా నిలుస్తాయి.'ఫాల్ 2026 స్నాప్‌షాట్' నివేదిక ప్రకారం.. ఈ తగ్గుదల మరింత కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న విద్యాసంస్థల వివరాల ప్రకారం.. గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య 15 శాతం, అండర్ గ్రాడ్యుయేట్ల సంఖ్య 3 శాతం, ఓపీటీ విద్యార్థుల సంఖ్య 6 శాతం తగ్గింది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే కొత్త అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశాలు 15 శాతం తగ్గాయి.ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ నవంబర్ 16న విడుదల చేసిన 'ఓపెన్ డోర్స్ 2026' నివేదిక ప్రకారం.. 2025-26లో అమెరికా ఉన్నత విద్యాసంస్థల్లో మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 3 శాతం తగ్గి 11,46,163కు చేరుకుంది. 800కు పైగా విద్యాసంస్థలపై నిర్వహించిన ప్రత్యేక 'ఫాల్ 2026 స్నాప్‌షాట్' సర్వేలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 9 శాతం తగ్గగా, కొత్త ప్రవేశాలు 15 శాతం పడిపోయినట్లు నమోదైంది.భారత్ విషయానికొస్తే ఈ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం ఏడాది క్రితం అంటే 2024-25లో అంతకుముందు ఏడాది కంటే 10 శాతం వృద్ధితో భారత్ నుంచి రికార్డు స్థాయిలో 3,63,019 మంది విద్యార్థులు అమెరికాకు వెళ్లారు. వరుసగా మూడో ఏడాది కూడా చైనాను వెనక్కి నెట్టి అమెరికాకు అత్యధిక మంది విద్యార్థులను పంపే దేశంగా భారత్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నప్పటికీ, ఆ వేగం మాత్రం మందగించింది. అమెరికాలోని మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో దాదాపు 52 శాతం మంది భారత్, చైనాకు చెందినవారే.భారతీయ విద్యార్థులు అత్యధికంగా ఇష్టపడే ఇంజనీరింగ్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ కోర్సులు ఉండే 'గ్రాడ్యుయేట్' (మాస్టర్స్) స్థాయిలోనే ఈ తగ్గుదల ఎక్కువగా ఉంది. భారతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య ఏకంగా 34 శాతం పడిపోయి 1,16,609కు చేరగా, అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలు కేవలం 1 శాతం తగ్గి 39,711 వద్ద నిలిచాయి.ఈ వ్యత్యాసం చాలా విషయాలను స్పష్టం చేస్తోంది. చాలా భారతీయ కుటుంబాలకు అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ అంటే కేవలం చదువుకు సంబంధించిన పెట్టుబడి మాత్రమే కాదు.. అది వృత్తిపరమైన అనుభవం, మెరుగైన సంపాదన, దీర్ఘకాలిక విదేశీ కెరీర్‌కు ఒక మార్గం. అమెరికాలో చదువు ఖర్చు భారీగా పెరుగుతున్న తరుణంలో, చదువు పూర్తయ్యాక ఉద్యోగం దొరుకుతుందన్న నమ్మకం సన్నగిల్లడం విద్యార్థులను ఆలోచనలో పడేస్తోంది.ఇప్పటికే అమెరికాలో చదువు పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నవారు లేకపోయి ఉంటే, భారతీయ విద్యార్థుల సంఖ్యలో ఈ తగ్గుదల మరింత తీవ్రంగా ఉండేదని నిపుణులు చెబుతున్నారు. చదువు తర్వాత తాత్కాలికంగా పనిచేసేందుకు వీలుకల్పించే ఓపీటీ కింద ఉన్న భారతీయుల సంఖ్య 27 శాతం పెరిగి 1,82,201కు చేరుకుంది. నివేదికలోని మొత్తం భారతీయ విద్యార్థుల్లో వీరే సగానికి పైగా ఉన్నారు.మరోవైపు, చైనా విద్యార్థుల సంఖ్యలో తగ్గుదల కొంత తక్కువగానే ఉంది. చైనా గ్రాడ్యుయేట్ విద్యార్థులు 5 శాతం తగ్గి 1,14,043కు, అండర్ గ్రాడ్యుయేట్లు 5 శాతం తగ్గి 74,594కు, ఓపీటీలో ఉన్నవారు 1 శాతం తగ్గి 61,545కు పరిమితమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల విద్యార్థులను కలిపి చూస్తే, మాస్టర్స్ విద్యార్థులు 22 శాతం తగ్గడంతో మొత్తం గ్రాడ్యుయేట్ ప్రవేశాలు 13 శాతం పడిపోయి 4,23,078కు చేరాయి. అయితే డాక్టోరల్ (పీహెచ్‌డీ) విద్యార్థుల సంఖ్య 3 శాతం పెరగగా, అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాల్లో పెద్దగా మార్పు లేకుండా 3,56,165 వద్ద స్థిరంగా ఉన్నాయి.ఓపీటీ గణాంకాలు ప్రత్యేకంగా గమనించాల్సినవి. ఎందుకంటే గత కొన్నేళ్లుగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అంతర్జాతీయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉండటంతో 2025-26లో ఓపీటీలో ఉన్నవారి సంఖ్య 14 శాతం పెరిగి 3,35,785కు చేరుకుంది. అయితే, ఈ విభాగం కూడా ఇప్పుడు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైందని తాజా సర్వే సూచిస్తోంది.అమెరికా విశ్వవిద్యాలయాలకు ఈ పరిణామాలు కేవలం అడ్మిషన్లకే పరిమితం కావు. అంతర్జాతీయ విద్యార్థులు వాటికి గణనీయంగా ఆదాయం, పరిశోధన ప్రతిభ, నైపుణ్యం కలిగిన గ్రాడ్యుయేట్లను అందించే ప్రధాన వనరులు. అమెరికా వాణిజ్య శాఖ ప్రకారం.. 2025లో అంతర్జాతీయ విద్యార్థులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు దాదాపు 56 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సమకూర్చారు.అందుకే అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించాలనే ఆసక్తి అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఇంకా బలంగానే ఉంది. 'ఫాల్ స్నాప్‌షాట్' సర్వేలో 75 శాతం విద్యాసంస్థలు క్యాంపస్‌లో అంతర్జాతీయ దృక్పథం అవసరమని పేర్కొనగా, 60 శాతం సంస్థలు విదేశీ విద్యార్థుల ఆర్థిక సహకారాన్ని అంగీకరించాయి. ఏకంగా 91 శాతం విద్యాసంస్థలు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాల్లో అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకోవడానికి తాము ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపాయి. 75 శాతం సంస్థలు కంప్యూటర్ సైన్స్‌ను, చెరో 59 శాతం సంస్థలు ఇంజనీరింగ్, బయోలాజికల్ సైన్సెస్‌ను తమ ప్రధాన రిక్రూట్‌మెంట్ విభాగాలుగా గుర్తించాయి. 2025-26లో మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో 57 శాతం మంది స్టెమ్ (ూఇఓ) కోర్సుల్లోనే ఉన్నారు. ఇందులో మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో 2,86,168 మంది, ఇంజనీరింగ్‌లో 2,14,193 మంది విద్యార్థులు చదువుతున్నారు.

దావూద్ ఇబ్రహీం భవనం కూల్చివేత



హజ్ యాత్రికులకు తాత్కాలిక విడిది కేంద్రంగా 1939లో దక్షిణ ముంబయి పక్కోడియా స్ట్రీట్‌లోని 'హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా'ను నిర్మించారు. కానీ గడిచిన ఐదు దశాబ్దాల్లో అది పరారీలో ఉన్న అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని.. రోడ్డు విస్తరణ కోసం కూల్చివేయడానికి ముంబయి నగరపాలక సంస్థ సిద్ధమవుతుంది. మొదటి అంతస్తులోని 10 గదులు, గ్రౌండ్ ఫ్లోర్‌లోని వివాదాస్పద 'ప్రార్థనా మందిరాన్ని' కూల్చివేయడానికి సన్నాహాలు జరుగుతున్నప్పటికీ, ఈ కట్టడం ఇప్పటికీ అండర్‌వరల్డ్ చరిత్రకు ఒక ఆనవాలుగా నిలిచింది.మరోవైపు, దీనికి అసలు యజమాని ఎవరనే దానిపై న్యాయపోరాటం కూడా నడుస్తోంది. ఈ పబ్లిక్ ఛారిటీ గెస్ట్‌హౌస్‌లోకి ఒక పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కొడుకు అద్దెదారుగా ప్రవేశించి, ఆపై దానిని శాశ్వతంగా ఆక్రమించుకున్నాడు. అలా దావూద్ ఇబ్రహీం నేర సామ్రాజ్యమైన 'డి-కంపెనీ'కి ఇది ప్రధాన కార్యాలయంగా మారిపోయింది.దావూద్ ఇబ్రహీం కస్కర్ మొదట్లో తన తల్లిదండ్రులు హెడ్ కానిస్టేబుల్ ఇబ్రహీం కస్కర్, అమీనా బీ, తన తోబుట్టువులతో కలిసి ముసాఫిర్‌ఖానా రెండో అంతస్తులో నివసించేవాడు. 1970వ దశకం చివరలో, 1980లలో ముంబయి అండర్‌వరల్డ్‌లో దావూద్ ఇబ్రహీం ప్రాబల్యం పెరగడంతో, అద్దె ఒప్పందం కాస్తా కనుమరుగైంది. అతను ఆ భవనాన్ని కబ్జా చేసి రెండో అంతస్తు మొత్తాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నాడు. హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా ట్రస్టుకు చెందిన ఈ యాత్రికుల విడిది అతడి నివాసంగా, కార్యాలయంగా, అప్రకటిత ప్రధాన కార్యాలయంగా మారిపోయింది.ఈ స్థలంపై దావూద్‌కు ఎలాంటి హక్కు ఉన్నట్లు ఏ పత్రాలూ లభించలేదు. దావూద్ ఇబ్రహీంకు గానీ, కస్కర్ కుటుంబంలోని ఏ ఒక్కరికి గానీ ఈ ఆస్తిపై కనీస రిజిస్ట్రేషన్ గానీ, యాజమాన్య హక్కుల ఆధారాలు గానీ లేవని ప్రభుత్వ సంస్థల రికార్డులు, న్యాయపత్రాలుస్పష్టం చేస్తున్నాయిగ్రౌండ్ ఫ్లోర్‌లోని 32 వాణిజ్య దుకాణాలు, పై అంతస్తులలోని 19 నివాస గదులు సాధారణ అద్దెదారులు, దుకాణదారుల ఆధీనంలో ఉండగానే, కేవలం ఆక్రమణ బలంతోనే ఈ ముఠా పక్కోడియా స్ట్రీట్ నుంచి చక్రం తిప్పింది. స్మగ్లింగ్ వస్తువులను దాచడానికి కూడా ఈభవనాన్ని ఉపయోగించేవారు1986లో దావూద్ ఇబ్రహీం భారత్ విడిచి పారిపోయిన తర్వాత కూడా అతడి అనుచరులు ఈ భవనంలో చురుకుగా ఉండేవారు. ఆ తర్వాత 1993 ముంబయి వరుస బాంబు పేలుళ్ల కుట్ర జరిగిన ప్రధాన కేంద్రాల్లో ఇది కూడా ఒకటిగా నిలిచింది. 1993 పేలుళ్ల తర్వాత, కస్కర్ కుటుంబం చెర నుంచి ఈ భవనాన్ని విడిపించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం సుదీర్ఘ ప్రయత్నాలు మొదలుపెట్టింది. దావూద్ తల్లి అమీనా బీ, ఇతర కుటుంబ సభ్యులు అక్కడే నివసిస్తూ వచ్చారు. ఆ తర్వాతి కాలంలో దావూద్ సోదరుడు ఇక్బాల్ కస్కర్ దీనిని వినియోగించుకున్నట్లు వార్తలు వచ్చాయి. చివరకు టెర్రరిస్ట్ అండ్ డిస్రప్టివ్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్ నిబంధనల కింద దావూద్ ఆధీనంలోని రెండో అంతస్తును కోర్టు జప్తు చేసింది.1998, 2018 మధ్య కాలంలో స్మగ్లర్స్ అండ్ ఫారిన్ ఎక్స్చేంజ్ మానిప్యులేటర్స్ యాక్ట్ కింద ఈ కుటుంబ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు చేపట్టింది. ఈ ఉత్తర్వులపై అమీనా బీ, దావూద్ సోదరి హసీనా పార్కర్ ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేశారు. చివరకు ఏప్రిల్ 2018లో సుప్రీంకోర్టు వారి పిటిషన్‌ను కొట్టివేస్తూ, ముంబయిలోని వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అసలు తమకు సంబంధం లేని గదుల కోసం కస్కర్ కుటుంబంతో ప్రభుత్వం పోరాడుతుండగానే, మరోవైపు ఈ భవనానికి అసలైన యజమాని అయిన 'హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా ట్రస్ట్' శిథిలావస్థలో ఉన్న ఈ కట్టడాన్ని రూ. 1.10 కోట్లకు 'సైఫీ బుర్హానీ అప్‌లిఫ్ట్‌మెంట్ ట్రస్ట్' కు విక్రయించేందుకు నవంబర్ 2015లో ఛారిటీ కమిషనర్ నుంచి అనుమతి పొందినట్లు బాంబే హైకోర్టు పత్రాలు చెబుతున్నాయి.ఈ విక్రయంతో భవన చరిత్రలో ఒక అధ్యాయం ముగిసినప్పటికీ, ఇదిదృష్టిని ఆకర్షించింది. నగరపాలక సంస్థ ఈ కట్టడాన్ని అత్యంత శిథిలావస్థలో ఉన్న, ప్రమాదకరమైన భవనంగా వర్గీకరించింది. దీనిని కూల్చివేయడానికి హైకోర్టు ఆగస్టు2020లో అనుమతి మంజూరు చేసింది.ఆ తర్వాతి కొన్నేళ్లలో,అధికారులు పై అంతస్తులను ఖాళీ చేయించి, దావూద్ ఇబ్రహీం ఒకప్పుడు నివసించి, కార్యకలాపాలు సాగించిన మొదటి, రెండో అంతస్తులలోని ప్రధాన నివాస భాగాలను కూల్చివేశారు.మిగిలిన 10 మొదటి అంతస్తు గదులతో పాటు గ్రౌండ్ ఫ్లోర్ స్థలాన్ని కూడా త్వరలోనే కూల్చివేయనున్నట్లు నవంబర్ 16న ఃఓఅ నోటీసు జారీ చేసే వరకు గ్రౌండ్ ఫ్లోర్ అలాగే ఉంది. రోడ్డు విస్తరణ కోసం, ప్రమాదకర కట్టడాన్ని తొలగించడానికి ఈ కూల్చివేత అవసరమైందిఅయితే, స్థానికులు దీనిపై నిరసన వ్యక్తం చేస్తూ, పేర్కొన్నట్లు గ్రౌండ్ ఫ్లోర్ కేవలం 'ప్రార్థనా మందిరం'మాత్రమే కాదని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ తన నోటీసులో ఆ స్థలాన్ని 'ప్రార్థనా మందిరం'గా పేర్కొంటూ, ప్రార్థనలు చేసుకునేవారు ప్రత్యామ్నాయ స్థలానికి వెళ్లాలని ఆదేశించిందిఅది ఒక మసీదు అని, వక్ఫ్ బోర్డుకు దానం చేసిన దాత ఆస్తి అని, అసలు మొదటి నుంచి దీనిని కి చట్టబద్ధంగా విక్రయించే హక్కు లేదని స్థానికులు, దుకాణదారులు, మహారాష్ట్ర వక్ఫ్ బోర్డు వాదిస్తున్నాయి. ఈ భవనం వక్ఫ్ ఆస్తి కాదని గతంలో వక్ఫ్ ట్రైబ్యునల్ ప్రకటించినప్పటికీ, ఈ విక్రయంపై అభ్యంతరాలు సుప్రీంకోర్టు వరకు వెళ్లాయి.పునరాభివృద్ధి చేసిన క్లస్టర్‌లో తమకు శాశ్వత స్థలం పొందే హక్కు ఉందని పేర్కొంటూ అద్దెదారులు, గ్రౌండ్ ఫ్లోర్ నిర్వాహకులు తమ నిరంతర స్వాధీనతను సాక్ష్యంగా చూపుతున్నారు. ఇక, స్థానికులకు మద్దతుగా నిలిచిన ఎంఐఎం నేత వారిస్ పఠాన్ ఈ కూల్చివేత చర్యను చట్టవిరుద్ధమని అభివర్ణించారు. "సుప్రీంకోర్టు, వక్ఫ్ ట్రిబ్యునల్ స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఈ నోటీసు జారీ చేయడం చట్టవిరుద్ధం. ఇది 140 ఏళ్ల నాటి మసీదు. అది మసీదు అని గుర్తించినంత మాత్రాన బుల్డోజర్ తీసుకొచ్చి కూల్చేయలేరు. మా న్యాయపరమైన వాదనలు వినిపించడానికి మేము కేవలం 15 రోజుల గడువు మాత్రమే కోరుతున్నాం.. ఇలా ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తాం" అని పఠాన్ అన్నారు.ప్రార్థనా స్థలాన్ని కూల్చివేయడానికి , ట్రస్ట్ కుట్ర పన్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే అమీన్ పటేల్ ఆరోపించారు. ట్రస్ట్ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను స్థానికులు వ్యతిరేకించడం లేదని, అయితే వక్ఫ్ ట్రైబ్యునల్ ముందు వివాదం పెండింగ్‌లో ఉన్నందున, ఇరుపక్షాల వాదనలు వినకుండా ఏకపక్ష చర్యలు తీసుకోవడం పూర్తిగా తప్పని పటేల్ తెలిపారు.

తన కథ వెనక సోనియా రాజకీయ వ్యథ!

సోనియా గాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో రాసింది పూర్తిగా రాజీవ్ గాంధీతో తన ప్రేమకథ అనుకుంటే పొరపాటే అవుతుంది. ఆమె రాసింది తన అత్తమ్మ, భర్త హత్యలకు గురైన విషాద గాథల గురించి అనుకుంటే తప్పుదోవ పట్టినట్లవుతుంది. ఆమె రాసింది 58 ఏళ్ల క్రితం ఇటలీ నుంచి పరాయిదేశంలో అడుగుపెట్టి, భారతదేశ ప్రజానీకంతో తానెలా మమేకమయిందీ చెప్పేందుకే సోనియా తన ఆత్మకథ వెలువరించారని అనుకుంటే అది కూడా పూర్తిగా సరైనది కాదు. 'బిలాంగింగ్'ను నిశితంగా చదివితే ఈ దేశ రాజకీయ జీవితంలోకి సంఘ్ పరివార్, బీజేపీ చొచ్చుకుపోవడం దేశానికి ఏ విధంగా తీరని నష్టం చేస్తుందో చెప్పడానికే ఆమె ప్రధానంగా తన ఆత్మకథను ఉద్దేశించినట్లు కనిపిస్తోంది. వందేళ్లకు పైగా చరిత్ర గల సంఘ్ పరివార్ మూలాలు, ఆలోచనా విధానం, ఆయా సందర్భాల్లో ఈ దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన తీరును వివరిస్తూ ఆరెస్సెస్--బీజేపీలపై ఆమె ఒక సైద్ధాంతిక సమర శంఖారావం చేశారు. తన ఆత్మకథలో 147 సార్లు ఆరెస్సెస్, జనసంఘ్, బీజేపీల గురించి ప్రస్తావించిన సోనియా వాటి మూలాలపై దాడి చేసేందుకే ప్రయత్నించారు. తాను ఇండియా రాక పూర్వం ఆరెసట?స్ చరిత్రనూ ఆమె వివరించారు. 1925లో ఏర్పడిన రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్... రాజ్యాంగం ప్రవచించిన లౌకికవాదం, సమానత్వం, బహుళత్వ సిద్ధాంతాలను పక్కనపెట్టి ముస్లింలు, క్రైస్తవులు వంటి మైనారిటీ మతస్థులను ద్వితీయశ్రేణి పౌరులుగా మార్చే హిందూ రాష్ట్ర స్థాపనే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని విశ్లేషించారు. ఈ ఆధిపత్య భావజాలమే తర్వాతి కాలంలో భారతీయ జనతా పార్టీ రాజకీయ అజెండాగా మారిందని వివరించారు. స్వాతంత్ర్య సమరంలో సంఘ్ పాత్ర ఏమీ లేదని, కాంగ్రెస్ స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటిష్ పాలకుల దాడులు, కారాగార శిక్షలను అనుభవిస్తున్న సమయంలో, వినాయక్ దామోదర్ సావర్కర్ వంటి ఆరెస్సెస్ సీనియర్ సిద్ధాంతకర్తలు తమకు క్షమాభిక్ష ప్రసాదించాలని వేడుకుంటూ బ్రిటిష్ వలసపాలకులతో కుమ్మక్కయ్యారని సోనియా రాశారు. సంఘ్ ప్రధాన సిద్ధాంతకర్తలు హిట్లర్‌ను, మైనారిటీల పట్ల ఆయన అనుసరించిన విధానాలను ప్రశంసించారని సోనియా తెలిపారు. తమ ప్రణాళికకు కాంగ్రెస్, దాని విలువలే ప్రధాన అడ్డంకిగా ఆరెస్సెస్ ఎప్పుడూ భావించిందని ఆమె పేర్కొన్నారు. దేశ పాలనాధికారాలు సంఘ్ పరివార్ చేతుల్లోకి వెళితే సంఘ్ విభజన వాద, తిరోగమన, నిరంకుశ సిద్ధాంతాలు దేశ ఐక్యతకు ముప్పు చేస్తాయని కాంగ్రెస్ ఎప్పుడూ గట్టిగా నమ్ముతూ వచ్చిందని సోనియా తెలిపారు.
ఇందిర పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలను సంఘటితం చేసిన జయప్రకాశ్ నారాయణ్‌ను ఆరెస్సెస్ ఒక ప్రధాన పావుగా వాడుకున్నదని, ఆయన వారి ఎత్తుగడలకు ఉపయోగపడుతున్నారని ఇందిరాగాంధీ తీవ్రంగా ఆందోళన చెందినట్లు సోనియా తన ఆత్మకథలో వెల్లడించారు. మితవాద, మతతత్వ శక్తులతో చేతులు కలపడం కాంగ్రెస్ సిద్ధాంతాలకు ద్రోహం చేయడమేనని ఇందిర విశ్వసించారని సోనియా అన్నారు. జర్మనీలోని నాజీల 'బ్రౌన్ షర్ట్' ఉద్యమంతో ఆరెస్సెస్ పెరుగుదలను ఇందిర పోల్చినట్లు తెలిపారు. 'నేను రాజీనామా చేస్తే కాంగ్రెస్ ముక్కలైపోతుంది, ఆరెస్సెస్ తన లక్ష్యాన్ని సాధించుకుంటుంది. ఆ సంస్థ చరిత్ర నాకు తెలుసు. వారు ఏదైనా చేయగలరు. దేశాన్ని విధ్వంసం చేస్తారు' అని రాజీవ్‌కు ఇందిరాగాంధీ చెప్పినట్లు సోనియా తన ఆత్మకథలో తెలిపారు. ఎమర్జెన్సీ తర్వాత జనతా ప్రభుత్వంలో జనసంఘ్ కీలక పాత్ర పోషించిందని, అయితే ఆరెస్సెస్ సభ్యత్వాలకు రాజీనామా చేయాలని లౌకికవాదులు డిమాండ్ చేయడంతో వాజపేయి, ఆడ్వాణీ తమ మంత్రిపదవులకు రాజీనామా చేసిన వైనాన్ని కూడా సోనియా వివరించారు. 1984 లో ఢిల్లీలో సిక్కుల ఊచకోతలో ఆరెస్సెస్ కూడా పాల్గొన్నదని ఆమె వెల్లడించారు. మత కల్లోలాలను, హింసాకాండను నివారించేందుకు కాంగ్రెస్ రెండుసార్లు బిల్లులను తీసుకువచ్చినప్పటికీ బీజేపీ, ఆరెస్సెస్ వ్యతిరేకించాయని విమర్శించారు. మహాత్మాగాంధీ కలలు కన్న రామరాజ్యాన్ని రాజీవ్ గాంధీ స్థాపించాలనుకుంటే ఆరెస్సెస్ విషపూరిత ప్రచారంతో దాన్ని అడ్డుకున్నదని చెప్పారు. ఆడ్వాణీ రథయాత్ర, బాబ్రీమసీదు కట్టడం కూల్చివేత, గుజరాత్‌లో మారణకాండ గురించి ఆమె వివరంగా ప్రస్తావించి సంఘ్ పరివార్, బీజేపీలను దుయ్యబట్టారు. అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం వెనుక కూడా సంఘ్ పరివార్ హస్తం ఉన్నదని అన్నారు. బీజేపీ, ఆరెస్సెస్ వంటి మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకే తాను కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టానని ఆమె తేల్చి చెప్పారు. సోనియా అక్షరాల్లోని తీవ్రతను చూసి ఆమె పుస్తకాన్ని ప్రచురించేందుకు పెంగ్విన్ ప్రచురణ సంస్థ వెనుకాడినట్లు స్పష్టమవుతోంది.
ఇంకా సంఘ్, బీజేపీలపై సోనియా చేసిన విమర్శలు అన్నీ ఇన్నీ కావు. దశాబ్దాలుగా ఆరెస్సెస్ సాగిస్తున్న విషపూరిత ప్రచారం సోషల్ మీడియా రాకతో మరింత వేగవంతమైందని, ఏఐ, డీప్‌ఫేక్‌ల ద్వారా తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోందని, దేశ సామాజిక సమగ్రత తీవ్ర ప్రమాదంలో పడిందని సోనియా భావిస్తున్నారు. మైనారిటీలపై ద్వేషాన్ని పెంచి, సమాజంలోని పేదలు, అణగారిన వర్గాల ప్రయోజనాలను పణంగా పెట్టి సంపన్నుల ప్రయోజనాలను కాపాడే విధానాలను అవలంబిస్తున్నారని సోనియా విమర్శించారు. పాఠ్యపుస్తకాలను మార్చడం నుంచి విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకాల వరకు, ఆరెస్సెస్ దాదాపు అన్ని ఉన్నత విద్యాసంస్థలను తన సైద్ధాంతిక నియంత్రణలోకి తీసుకున్నదని, దీనివల్ల విద్యా వ్యవస్థకు తీరని నష్టం జరుగుతోందని సోనియా చెప్పారు.
చివరకు తాను, మోదీ పూర్తిగా భిన్నమైన సైద్ధాంతిక ప్రపంచాల నుంచి ఎలా వచ్చామో కూడా సోనియా తెలిపారు. 'ఈ దేశం గురించి మోదీకి ఉన్న భావనకు, నాకు ఉన్న భావనకు మధ్య చాలా తేడా ఉన్నది. భారతదేశం గురించి నేను నేర్చుకున్నదంతా మా కుటుంబ సభ్యుల నుంచి, వారు చేసిన త్యాగాల నుంచి, అనేక జాతులు, సంస్కృతులు, భాషలు, విశ్వాసాలను గౌరవిస్తూ అందరికీ స్వేచ్ఛ, సమానత్వం అనే సూత్రాలపై నిలిచిన దేశం పట్ల వారికి ఉన్న విశ్వాసం నుంచి వచ్చింది. నరేంద్ర మోదీకి సంబంధించిన భారతదేశ భావన ఆరెస్సెస్ సిద్ధాంతకర్తల ఆలోచనల నుంచి, మతం, సంస్కృతి అన్నింటికంటే ఉన్నతమైనవని భావించే మౌలికవాదం నుంచి రూపుదిద్దుకున్నది' అంటూ 'ఆయన తాను ఆశిస్తున్న భారతదేశం కోసం పోరాడుతున్నారు, నేను ఆధిపత్యానికి వ్యతిరేకమైన, సమ్మిళితత్వం, లౌకికవాదం, సామాజిక న్యాయానికి కట్టుబడిన భారతదేశం కోసం పోరాడుతున్నాను' అని సోనియా చెప్పారు. హిందూమతంలోని సమ్మిళితత్వం అనే ప్రధాన ఆదర్శం 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అనే వేదమంత్రంలో సంక్షిప్తంగా వ్యక్తమవుతుందని ఆమె సంఘ్ పరివార్‌కే పాఠం బోధించారు.
కొన్ని దశాబ్దాల క్రితం ఇండియాలో అడుగుపెట్టిన ఒక విదేశీ మహిళ ఆరెసట?స్, బీజేపీలపై ప్రయోగించిన ఆయుధమే సోనియా ఆత్మకథ. స్పష్టంగా ఇది కాంగ్రెస్ పార్టీ దృక్పథం. ఇప్పటికే 2 లక్షలకు పైగా కాపీలు అమ్ముడుపోయిన ఈ పుస్తకం ఇతర భారతీయ భాషల్లో కూడా వచ్చే అవకాశాలున్నాయి. అయితే సోనియా రాసినట్లు కాంగ్రెస్ పార్టీని ఆరెస్సెస్ పూర్తిగా ద్వేషించిందా అన్నది చర్చనీయాంశం. నిజానికి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీలో ఆరెస్సెస్‌ను నిషేధించినప్పటికీ బాలాసాహెబ్ దేవరస్ వంటి సంఘ్ అగ్రనేతలు జాతీయవాద కారణాలతో ఇందిరాగాంధీని ప్రశంసించారనడానికి దాఖలాలు లేకపోలేదు. 1980ల్లో ఇందిర హిందూ కేంద్రీకృత వైఖరిని అధికంగా అవలంబించారని, సంఘ్ ప్రముఖులతో ప్రైవేట్‌గా చర్చలు జరిపారని, ఎన్నికల్లో ప్రయోజనం పొందారని కాంగ్రెస్ రాజకీయాలను కొన్ని దశాబ్దాలుగా అధ్యయనం చేస్తోన్న ప్రముఖ జర్నలిస్టు నీరజా చౌదరి 'హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' అన్న తన పుస్తకంలో పేర్కొన్నారు. వాజపేయిని కూడా విస్మరించి ఇందిరకు ప్రాధాన్యమిచ్చారని ఆమె తెలిపారు. ఇందిర తర్వాత ప్రధాని అయిన రాజీవ్ గాంధీ కూడా దేవరస్‌తో రహస్య చర్చలు జరిపారని ఆమె వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం మాలినీ భట్టాచార్జీ అనే సీనియర్ రచయిత్రి రాసిన 'స్వయం సేవక్' అనే ఆసక్తికరమైన పుస్తకం విడుదలయ్యింది. ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆరెస్సెస్ కోసం తమ జీవితాలను త్యాగం చేసిన పది మంది స్వయం సేవకుల జీవిత చరిత్రలను ఆమె ఆ పుస్తకంలో పొందుపరిచారు.

భారత్-జపాన్ బంధం మరింత బలోపేతం!

టోక్యో: భారత్, జపాన్ మధ్య రక్షణ, వ్యూహాత్మక సంబంధాలు మరో కీలక మలుపు తిరుగుతున్నాయి. మారుతున్న అంతర్జాతీయ పరిణామాలు, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న భద్రతా సవాళ్ల నేపథ్యంలో ఇరు దేశాలు తమ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు నిర్ణయించాయి. రక్షణ సాంకేతికత అభివృద్ధి, యుద్ధ నౌకల ఆధునికీకరణ, సముద్ర భద్రత, సైనిక సమాచార మార్పిడి వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని అంగీకరించాయి. ముఖ్యంగా యూనికార్న్ ప్రాజెక్టుకు సంబంధించిన రక్షణ ఒప్పందాలను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాయి. టోక్యోలో జరిగిన నాలుగో భారత్--జపాన్ 2+2 విదేశాంగ, రక్షణ మంత్రుల సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మోటెగి, రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరిణామాలపై విస్తృతంగా చర్చించారు.

యూనికార్న్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

భారత్--జపాన్ రక్షణ భాగస్వామ్యంలో యూనికార్న్ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. నౌకాదళ యుద్ధ నౌకల కోసం ప్రత్యేక స్టెల్త్ మాస్ట్ సాంకేతికతను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. యుద్ధ నౌకల్లోని రాడార్, కమ్యూనికేషన్, ఇతర ఎలక్ట్రానిక్ వ్యవస్థలను సమర్థంగా అనుసంధానించే ఈ సాంకేతికత వల్ల శత్రు రాడార్లకు నౌకలు సులభంగా చిక్కకుండా ఉండేందుకు వీలవుతుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ భారత్‌లోనే అధునాతన రక్షణ పరికరాల తయారీని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయి.

'డిజైన్ విత్ జపాన్ -- మేక్ ఇన్ ఇండియా' విధానంలో రక్షణ ఉత్పత్తుల తయారీని విస్తరించేందుకు ఇరు దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. నీటి అడుగున పనిచేసే పరికరాలు, క్షిపణి సాంకేతికత, అధునాతన రక్షణ వ్యవస్థల తయారీలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. దీనివల్ల భారత రక్షణ పరిశ్రమలకు జపాన్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పాటు స్వదేశీ తయారీ సామర్థ్యం పెరగనుంది.

సముద్ర భద్రతకు ఉమ్మడి వ్యూహం

హిందూ మహాసముద్రం, ఇండో-పసిఫిక్ ప్రాంతాల్లో సముద్ర భద్రతను మరింత పటిష్ఠం చేయడంపై భారత్, జపాన్ ప్రత్యేక దృష్టి సారించాయి. ఇటీవల కుదిరిన సముద్ర భద్రత సహకార ఒప్పందాన్ని త్వరగా అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించాయి. సముద్ర, గగనతల నిఘా, ప్రమాదాల్లో



చిక్కుకున్న వారిని రక్షించడం, కీలక సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం వంటి అంశాల్లో సమన్వయంతో పనిచేయనున్నాయి.

ఇరు దేశాల నౌకాదళాలు పరస్పరం ఒకరి దేశంలోని నౌకా మరమ్మతు కేంద్రాలను మరొకరు వినియోగించుకునేలా ప్రత్యేక ఒప్పందాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నాయి. సముద్రంలో అమర్చిన మందుపాతరలను గుర్తించడం, వాటిని నిర్వీర్యం చేసే సామర్థ్యాలను పెంపొందించుకోవడంపైనా సహకారాన్ని విస్తరించనున్నాయి. ఇప్పటికే ఇరు దేశాల మధ్య సైనిక సహకారం గణనీయంగా పెరిగిందని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. భారత్‌లో నిర్వహించిన వీర్ గార్డియన్--2026 వైమానిక విన్యాసాల్లో తొలిసారిగా జపాన్ వైమానిక దళ యుద్ధ విమానాలు పాల్గొనడం కీలక పరిణామమని పేర్కొన్నారు. అక్టోబర్ 13న టోక్యోలో జరిగిన మూడో భారత్--జపాన్ రక్షణ పరిశ్రమల వేదిక సమావేశం కూడా రక్షణ రంగ భాగస్వామ్యానికి దోహదపడిందని తెలిపారు.

బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణమే లక్ష్యం

అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితులపైనా ఇరు దేశాల మంత్రులు చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితులు, వాణిజ్య సమస్యలు, సరఫరా వ్యవస్థల్లో ఎదురవుతున్న అవరోధాలు ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, వాణిజ్య భద్రతపై ప్రభావం చూపుతున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో భారత్, జపాన్ వంటి విశ్వసనీయ భాగస్వామ్య దేశాల మధ్య సహకారం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఇరు దేశాలు కలిసి పనిచేయడం ద్వారా ఆసియాలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ కీలక పాత్ర పోషించగలవని అన్నారు. బహుళ ధ్రువ ఆసియా, బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణానికి భారత్--జపాన్ భాగస్వామ్యం దోహదపడుతుందని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కూడా ఇరు దేశాలు గుర్తించాయని తెలిపారు. ప్రపంచ వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం, ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

క్వాడ్ భాగస్వామ్యంతో ఇండో-పసిఫిక్‌కు భరోసా

ఇండో-పసిఫిక్ ప్రాంతం స్వేచ్ఛగా, బహిరంగంగా, సురక్షితంగా ఉండాలన్న లక్ష్యంతో క్వాడ్ భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేస్తున్నట్లు జైశంకర్ తెలిపారు. సముద్ర మార్గాలు, అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు, సరఫరా వ్యవస్థలను కొన్ని దేశాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించుకునే పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో సముద్ర రవాణా నిరంతరాయంగా కొనసాగడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్యంలో సముద్ర మార్గాల ప్రాధాన్యం దృష్ట్యా వాటి భద్రతకు అన్ని దేశాలు బాధ్యత తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

యుద్ధ స్వరూపం కూడా వేగంగా మారుతోందని, స్మార్ట్ ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ఆధారిత రక్షణ వ్యవస్థల ప్రాధాన్యం పెరుగుతోందని జైశంకర్ వివరించారు. ఈ రంగాల్లో భారత్, జపాన్ కలిసి పనిచేస్తే రక్షణ సామర్థ్యాలు పెరగడమే కాకుండా పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు కూడా కొత్త అవకాశాలు లభిస్తాయని అన్నారు.

75 ఏళ్ల దౌత్య బంధానికి ముందస్తు సన్నాహాలు

భారత్--జపాన్ దౌత్య సంబంధాలకు 2027లో 75 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ చారిత్రక మైలురాయికి ముందుగానే రక్షణ, భద్రత, సాంకేతిక రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. 2025 ఆగస్టులో కుదిరిన భద్రతా సహకార ఉమ్మడి ప్రకటన అమలులో భాగంగా తాజా చర్చలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2026లోనే రాజ్‌నాథ్ సింగ్, జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి మధ్య ఇది మూడో సమావేశం కావడం ఇరు దేశాల మధ్య పెరుగుతున్న రక్షణ సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

జపాన్ నౌకాదళ స్థావరాన్ని సందర్శించిన రాజ్‌నాథ్

సమావేశం అనంతరం భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జపాన్‌లోని యోకోసుకా నౌకాదళ స్థావరాన్ని సందర్శించారు. జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమితో కలిసి మొగామి తరగతికి చెందిన బహుళ ప్రయోజన యుద్ధ నౌక జేఎస్ నాటోరిని పరిశీలించారు. జపాన్ నౌకాదళ ఆధునికీకరణ, అధునాతన యుద్ధ నౌకల సామర్థ్యాలను ఆయనకు వివరించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ వివాదాలను అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి. ప్రపంచవ్యవస్థలో ప్రతి దేశం తన బాధ్యతను పెంచుకోవాల్సిన ప్రస్తుత తరుణంలో భారత్--జపాన్ భాగస్వామ్యం మరింత కీలకంగా మారుతోందని జైశంకర్ పేర్కొన్నారు.

సైనిక చర్యపై రాజకీయ రగడ

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో రెవెన్యూ మంత్రి జగత్ సింగ్ నేగి చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. రాఫెల్ ఫైటర్ జెట్ల కొనుగోలు ధరపై అవినీతి ఆరోపణలు చేస్తూ..'ఆపరేషన్ సిందూర్' సమయంలో సైన్యం, రాఫెల్ పనితీరుపై ఆయన చేసిన వ్యాఖ్యలపై గురువారం సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అసెంబ్లీ చర్చ సందర్భంగా మంత్రి జగత్ సింగ్ నేగి మాట్లాడుతూ.. రూ. 700 కోట్ల విలువైన రాఫెల్ యుద్ధ విమానాన్ని రూ. 2,300 కోట్లకు కొనుగోలు చేశారని, ఆ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని ఆరోపించారు. అదేమైనా బంగారు, వెండి జెట్టా? అని ప్రశ్నిస్తూ.. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌పై అనుకున్న స్థాయిలో ఒత్తిడి తీసుకురాలేకపోయామని, పైగా మనకే కఠిన పరిస్థితులు ఎదురయ్యాయనే అర్థంలో వ్యాఖ్యానించారు.

అసెంబ్లీలో రగడ.. బీజేపీ వాకౌట్

మంత్రి వ్యాఖ్యలపై గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష బీజేపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్, భారత సైన్యంపై చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని, మంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. దీనిపై స్పందించిన మంత్రి జగత్ సింగ్ నేగి క్షమాపణ చెప్పేందుకు నిరాకరించారు. నవంబర్ 18 నాటి అసెంబ్లీ చర్చల రికార్డు కాపీని సభ ముందు ఉంచుతూ.. తాను తప్పుగా ఏమీ మాట్లాడలేదని, అప్పట్లోనే అభ్యంతరం చెప్పకుండా ఇప్పుడు క్షమాపణ ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించారు. మంత్రి సమాధానంతో అసంతృప్తి వ్యక్తం చేసిన బీజేపీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. సభ బయట, సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. సైన్యం శౌర్యాన్ని, ఆపరేషన్ సిందూర్‌ను కించపరిచేలా మాట్లాడటం శోచనీయమని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలను ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సమర్థిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు హర్ష్ మహాజన్ కూడా మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ, జాతీయ భద్రత, రక్షణ అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

పహల్గామ్ దాడి

గతేడాది (2025) ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. మతపరమైన ఉద్రిక్తతలు రేకెత్తించడం, కాశ్మీర్ పర్యాటక రంగం ద్వారా నెలకొన్న ప్రశాంతతను దెబ్బతీయడం లక్ష్యంగా ఈ దాడి జరిగిందని అధికారులు పేర్కొన్నారు. దీనికి లష్కర్-ఎ-తొయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ బాధ్యత వహించింది. ఈ ఘటనకు ప్రతిస్పందనగా భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడులు నిర్వహించడంతో పాటు, సరిహద్దుల్లో నిఘా, భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. సింధు జల ఒప్పందం నిలిపివేత వంటి కఠిన దౌత్య నిర్ణయాలకు దారితీసిన ఈ పరిణామాలు, కాశ్మీర్ పర్యాటకంపై తాత్కాలిక ప్రభావం చూపినప్పటికీ, ఉగ్రవాదంపై దేశవ్యాప్తంగా ఐక్యతను, కఠిన వైఖరిని చాటిచెప్పాయి.

భారత ప్రజాస్వామ్యం పవిత్రమైనది..

న్యూఢిల్లీ: భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లు, ఓటములు ఉన్నప్పటికీ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయనే కారణంతో ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరిస్తే దేశ ప్రజాస్వామ్యానికి ముగింపు పలికినట్లేనని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమస్యలున్నాయని ఆరోపిస్తూ ఎన్నికలకు దూరంగా ఉండటం తమ పార్టీ విధానం కాదని తేల్చిచెప్పారు. రెండు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా చికాగో విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియపై తమకు ఉన్న అభ్యంతరాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ప్రజాస్వామ్య వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఎన్నికల్లో పాల్గొనకుండా ఉంటే ప్రజలకు తమ గొంతు వినిపించే అవకాశం కోల్పోతామని అభిప్రాయపడ్డారు.

ఎన్నికల బహిష్కరణకు కాంగ్రెస్ వ్యతిరేకం

ఎన్నికల వ్యవస్థలో లోపాలు ఉన్నాయన్న ఆరోపణలతో ఎన్నికలను బహిష్కరిస్తే భారత ప్రజాస్వామ్యం అంతమవుతుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై తీవ్ర ఆరోపణలు చేయాలంటే తమ వద్ద 100, 200, 300 శాతం కచ్చితమైన ఆధారాలు ఉండాలని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యకర్తలకు ఎన్నికల్లో పాల్గొనవద్దని పిలుపునిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్న క్షణమే ప్రజాస్వామ్య ప్రక్రియకు నష్టం జరుగుతుందని అన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడం కాంగ్రెస్ లక్ష్యం కాదని స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఎన్నికల వ్యవస్థలో ఏం జరుగుతోందో ప్రజలకు వివరించడం, ఎదురయ్యే రాజకీయ ఓటములను భరిస్తూనే పోరాటం కొనసాగించడం తమ వ్యూహమని వెల్లడించారు. ప్రజలు వ్యవస్థలోని సమస్యలను పూర్తిగా గుర్తించే వరకు తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు.

గ్రూప్ రిజర్వేషన్లపై బెర్త్‌ల పరిమితి తొలగింపు..

సమూహాలుగా ప్రయాణించే ప్రయాణికుల కోసం సౌత్ వెస్ట్రన్ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) కీలక నిర్ణయం తీసుకుంది. వివాహాలు, విద్యా విహారయాత్రలు, తీర్థయాత్రలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రయాణించే వారి సౌకర్యార్థం బల్క్ (గ్రూప్) టికెట్ బుకింగ్ నిబంధనలను సవరించింది. పాత నిబంధనల స్థానంలో కొత్త మార్గదర్శకాలను అమల్లోకి తెచ్చినట్లు ఎస్‌డబ్ల్యూఆర్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ మంజునాథ్ కనమడి వెల్లడించారు. తాజా నిబంధనల ప్రకారం... గ్రూప్ టికెట్ల బుకింగ్‌పై ఉన్న గరిష్ఠ బెర్తుల పరిమితిని ఎస్‌డబ్ల్యూఆర్ పూర్తిగా ఎత్తివేసింది. అంతేకాకుండా, ఈ బుకింగ్‌లకు అనుమతి ఇచ్చే అధికారాన్ని డివిజనల్ కార్యాలయాల నుంచి స్థానిక స్టేషన్లకే అప్పగించారు. ప్రధాన రిజర్వేషన్ కేంద్రాల్లోని స్టేషన్ మేనేజర్లు, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్లు ఇకపై ఎలాంటి ముందస్తు బెర్త్ పరిమితి లేకుండా గ్రూప్ బుకింగ్‌లను ఆమోదించవచ్చని అధికారులు స్పష్టం చేశారు. సాధారణ అడ్వాన్స్ రిజర్వేషన్ సమయం ప్రారంభమైన గంట తర్వాత, అంటే ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి ఈ దరఖాస్తులను స్వీకరిస్తారు. అన్ని తరగతుల్లో కన్ఫర్మ్, ఆర్‌ఏసీ లేదా వెయిటింగ్ లిస్ట్ టికెట్లకు ఈ వెసులుబాటు వర్తిస్తుంది. అయితే, దరఖాస్తుదారులు నేరుగా రైల్వే అధికారులకే దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా వచ్చే దరఖాస్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని రైల్వే స్పష్టం చేసింది. కేవలం విదేశీ పర్యాటకులు, ఎన్నారైలకు మాత్రమే పాత నిబంధనల ప్రకారం మినహాయింపు ఉంటుంది. దరఖాస్తు చేసుకునే సమయంలో ప్రయాణికులందరి పేర్లు, వయస్సు, లింగం, చిరునామాతో పాటు ప్రయాణ ఉద్దేశాన్ని స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుంది. ఈ సదుపాయం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి, దరఖాస్తులపై సీల్, సంతకం చేయాలని రైల్వే ఆదేశించింది. అలాగే తిరుగు ప్రయాణానికి కూడా అదే కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, అయితే దానిని ప్రత్యేక లావాదేవీగా పరిగణిస్తారని అధికారులు తెలిపారు.

బర్డ్‌ఫ్లూ కట్టడికి స్వదేశీ వ్యాక్సిన్

భోపాల్: దేశంలో పౌల్ట్రీ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న బర్డ్‌ఫ్లూ నియంత్రణ దిశగా భారత శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. కోళ్లకు సోకే హెచ్5ఎన్1 బర్డ్‌ఫ్లూ వైరస్‌ను ఎదుర్కొనేందుకు తొలిసారిగా స్వదేశీ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు. భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ శాస్త్రవేత్తలు ఈ టీకాను రూపొందించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్ పౌల్ట్రీ రంగానికి కొత్త భరోసా కల్పించనుందని భావిస్తున్నారు.



పౌల్ట్రీ రంగానికి ఊరట

బర్డ్‌ఫ్లూ వ్యాధి కారణంగా కోళ్ల పెంపకం, గుడ్లు, చికెన్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలపై ప్రభావం పడుతోంది. వైరస్ వ్యాప్తి చెందిన ప్రాంతాల్లో కోళ్ల మరణాలు, ముందస్తు నిర్మూలన చర్యలతో పౌల్ట్రీ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో హెచ్5ఎన్1 వైరస్‌ను లక్ష్యంగా చేసుకుని స్వదేశీ టీకా అభివృద్ధి చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

వచ్చే 20 ఏళ్ల పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'!

న్యూఢిల్లీ: భారత్‌ను ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తిగా, స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దాలంటే పారిశ్రామిక రంగం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. రాబోయే 20 ఏళ్లలో పరిశ్రమలు తీసుకునే ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయంలోనూ 'ఇండియా ఫస్ట్' అనే ఆలోచనే ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పెట్టుబడులను గణనీయంగా పెంచాలని, దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కోరారు. దేశాభివృద్ధికి అవసరమైన సంస్కరణలపై పరిశ్రమల ప్రతినిధులు ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా తనకు సూచనలు చేయవచ్చని స్పష్టం చేశారు. దిల్లీలో నిర్వహించిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశం, వార్షిక సదస్సులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. 'భారత్ 2047' లక్ష్యంగా దేశ ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, అంతర్జాతీయ మార్కెట్లలో భారత స్థానం, స్వదేశీ తయారీ వంటి అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. పరిశ్రమలు, రైతులు, చిన్న వ్యాపారులు, సంపద సృష్టికర్తలు, పన్నులు చెల్లించే వారిని గౌరవించినప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

గాంధీజీ స్వదేశీ సందేశాన్ని గుర్తుచేస్తూ..

దేశీయ ఉత్పత్తులు, స్వయం సమృద్ధి గురించి మహాత్మాగాంధీ 1930లో ఇచ్చిన సందేశాన్ని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాదాపు వందేళ్లు గడిచినా స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని మళ్లీ చెప్పాల్సిన పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. భారత పరిశ్రమలు దేశీయంగా తయారయ్యే వస్తువుల నాణ్యతను పెంచి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో దేశ ఆర్థిక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరిశ్రమలు పెట్టుబడులు పెట్టాలని కోరారు.

పరిశ్రమలకు మిత్రుడిగా ప్రభుత్వం

గత ప్రభుత్వాల సమయంలో పరిశ్రమలు ఎదుర్కొన్న అనుభవాలు అంత సానుకూలంగా ఉండేవి కావని మోదీ వ్యాఖ్యానించారు. ఆ ప్రభావం ఇప్పటికీ పరిశ్రమలకు, ప్రభుత్వానికి మధ్య సంబంధాల్లో కనిపిస్తోందని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పరిశ్రమలను భాగస్వాములుగా, మిత్రులుగా చూస్తోందని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి ఇంకా ఎలాంటి విధానపరమైన మార్పులు అవసరమో పరిశ్రమల ప్రతినిధులు బహిరంగంగా తెలియజేయాలని కోరారు. భయం, సంకోచం లేకుండా నేరుగా తనకు లేఖలు రాయవచ్చని చెప్పారు. పరిశ్రమల నుంచి వచ్చే నిర్మాణాత్మక సూచనలను ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.

వ్యవసాయ అనుబంధ రంగాల్లో భారీ పెట్టుబడులు

దేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలకమని, ఈ రంగంలో పరిశ్రమలు మరింత పెట్టుబడులు పెట్టాలని ప్రధాని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ఏయే దేశాల్లో డిమాండ్ ఉందో



గుర్తించి, అందుకు అనుగుణంగా ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. విదేశీ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా రైతుల నుంచి పంటలను సేకరించే పటిష్ఠమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెరిగితే రైతులకు మెరుగైన ఆదాయం లభించడంతో పాటు భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వస్తుందని అభిప్రాయపడ్డారు.

ఔషధ తయారీలో దిగుమతులపై ఆధారమెందుకు?

ఔషధ తయారీ రంగంలో భారత్ మరింత స్వయం సమృద్ధి సాధించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలకు మందులు సరఫరా చేసే స్థాయిలో భారత్ ఎదిగినప్పటికీ, ఔషధ తయారీకి అవసరమైన కీలక ముడి పదార్థాల విషయంలో విదేశాలపై ఆధారపడాల్సి వస్తోందని గుర్తుచేశారు. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్ బల్క్ డ్రగ్స్, ఔషధ తయారీలో ఉపయోగించే ఇతర మధ్యవర్తి పదార్థాలను భారీగా దిగుమతి చేసుకుంటున్నామని పేర్కొన్నారు. వీటిలో దేశీయంగా తయారు చేయగలిగే ఉత్పత్తులను గుర్తించి, ఆధునిక సాంకేతికతతో భారీ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పరిశ్రమలకు సూచించారు. దిగుమతులపై ఆధారపడటం తగ్గితే ఔషధ రంగంలో భారత్ మరింత బలపడుతుందని చెప్పారు.

ఉద్యోగుల జీతాలు పెంచారా?

పన్నుల విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను ప్రస్తావిస్తూ పరిశ్రమలకు మోదీ కీలక ప్రశ్న సంధించారు. 2014లో 30 శాతంగా ఉన్న ప్రాథమిక కార్పొరేట్ పన్ను రేటును 22 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానంలోనూ సంస్కరణలు చేపట్టామని, కొత్త పన్ను విధానంలో ఏడాదికి రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను భారం లేకుండా చేశామని వివరించారు. పన్ను రిటర్నుల దాఖలు, రిఫండ్ ప్రక్రియలను సులభతరం చేశామని పేర్కొన్నారు. గతంలో పన్ను వాపసు రావడానికి నెలల సమయం పట్టేదని, ఇప్పుడు అనేక సందర్భాల్లో వారంలోపే రిఫండ్ అందుతోందని చెప్పారు. అయితే ప్రభుత్వం కార్పొరేట్ పన్నులను తగ్గించినప్పుడు పరిశ్రమలు తమ ఉద్యోగుల సంఖ్యను పెంచాయా? వారి వేతనాలను కూడా పెంచాయా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం కల్పిస్తున్న పన్ను రాయితీల ప్రయోజనాలు కేవలం సంస్థలకే పరిమితం కాకుండా ఉద్యోగులకు, కార్మికులకు కూడా చేరాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ

గత వందేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని మోదీ వివరించారు. లైసెన్స్ కోటా రాజ్, జాతీయీకరణ విధానాల నుంచి ఒక దశలో ప్రపంచంలోని బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన పరిస్థితులను ప్రస్తావించారు. గత 12--13 ఏళ్లలో ప్రజలు, రైతులు, యువత, కార్మికులు, పారిశ్రామిక రంగం చేసిన కృషితో దేశ ఆర్థిక పరిస్థితి గణనీయంగా మారిందని చెప్పారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోందని, దాదాపు 7 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయని తెలిపారు.

నాణ్యత విషయంలో రాజీ వద్దు

ప్రపంచ బ్యాంకు నివేదికను ప్రస్తావిస్తూ గత 12--13 ఏళ్లలో సుమారు 50 కోట

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి

- నూతన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలకు ఎంపీ కేశినేని చిన్ని అభినందనలు





తిరువూరు, మహానగర్

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ మండలాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నూతన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలకు సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తిరువూరు, ఏ.కొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాల్లో గురువారం నిర్వహించిన నూతన ఎంపీపీలు, వైస్ ఎంపీపీల ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో ఆయన పాల్గొని వారికి అభినందనలు తెలిపారు. తిరువూరు ఎంపీపీగా గద్దె వెంకటేశ్వరరావు (వెంకన్న), వైస్ ఎంపీపీగా మడిపల్లి యోహాన్, ఏ.కొండూరు ఎంపీపీగా భూక్య సురేష్ బాబు, వైస్ ఎంపీపీగా జాస్తి టి. చందన్ (పండు), గంపలగూడెం ఎంపీపీగా బూరుగు అంజలి, వైస్ ఎంపీపీగా చెరుకూరి సాయిచంద్, విస్సన్నపేట ఎంపీపీగా వల్లభనేని రాణి, వైస్ ఎంపీపీగా తంబారు విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ



ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పదవులను ప్రజాసేవకు వేదికగా మలుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు మారుమూల ప్రాంతాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. మహిళా ప్రజాప్రతినిధులు మండలాల అభివృద్ధి, మహిళా సాధికారతలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందని, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలవాలని పేర్కొన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, నూతన ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీ చిన్ని అన్నారు.

ఎంపీపీగా మట్టా కనక విజయలక్ష్మి

చల్లపల్లి, మహానగర్:

మండల పరిషత్ నూతన పాలకవర్గం గురువారం కొలువుతీరింది. నూతన ఎంపీపీగా జనసేనకు చెందిన మట్టా కనక విజయలక్ష్మి, వైస్ ఎంపీపీగా టీడీపీకి చెందిన మోర్ల శివ నాగకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నికల కోసం గురువారం మధ్యాహ్నం ఎన్నికల అధికారి టి.కొండారెడ్డి ఎంపికైన ఎంపీటీసీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత 15 మంది ఎంపీటీసీలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీపీగా మట్టా కనక విజయలక్ష్మి అభ్యర్థిత్వాన్ని చల్లపల్లి-1 ఎంపీటీసీ పైడిపాముల స్వప్న ప్రతిపాదించగా, చల్లపల్లి-3 ఎంపీటీసీ అద్దేపల్లి జయలక్ష్మి సాయికుమారి బలపరిచారు. వైస్ ఎంపీపీగా మోర్ల శివనాగ కుమార్ అభ్యర్థిత్వాన్ని చల్లపల్లి-4 ఎంపీటీసీ బొందలపాటి శ్యామసుందరి ప్రతిపాదించగా, వక్కలగడ్డ ఎంపీటీసీ కొడాలి కార్తీక్ బలపరిచారు. వీరిరువురి ఎన్నిక ఏకగ్రీవంగా జరుగ్గా, అనంతరం ఎంపీపీ, వైస్ ఎంపీపీల చేత ఎన్నికల అధికారి ప్రమాణం చేయించారు. తొలుత ఎన్నికల అధికారి 15 మంది ఎంపీటీసీలచే ప్రమాణ స్వీకారం చేయించారు. కూటమి ఎంపీటీసీలు పైడిపాముల స్వప్న, మోర్ల శివనాగకుమార్, అద్దేపల్లి జయలక్ష్మి సాయి కుమారి, బొందలపాటి శ్యామసుందరి, బోలెం సుజాత, పాము లలిత, మట్టా కనక విజయలక్ష్మి,



సూదాని సంపతలక్ష్మి, కొడాలి కార్తీక్, కాగిత రమేష్ బాబు, పడమట శ్రీరావమ్మ, వైసీపీ ఎంపీటీసీలు కోలవెన్ను విజయదుర్గ, డొక్కు నాగేశ్వరరావు, బడుగు వనజ, బడుగు నరసమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీడీవో ఎం.ఎం.ఆనందకుమారి, తహసీల్దార్ ఎం. హరినాథ్, డిప్యూటీ ఎంపీడీవో వి.పద్మావతి, సూపర్నెంట్ అతావుల్లా పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ ఛాంబర్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఆసీనులను చేసి శు భాకాంక్షలు తెలిపారు. పాలకవర్గ సభ్యులు అందరూ వారికి శుభాకాంక్షలు తెలియచేశారు. పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ (లంకబాబు), టీడీపీ ముఖ్య నాయకులు యార్లగడ్డ అరవింద్, టీడీపీ మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, కూటమి నాయకులు నూతన ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు.

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఓటర్లు భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచన

డ్రోన్లతో పర్యవేక్షిస్తూ గ్రామంలో పోలీసుల కవాతు





విజయవాడ, మహానగర్

గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆదేశాల మేరకు గురువారం పశ్చిమ డివిజన్ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పశ్చిమ జోన్ డీసీపీ జి. రామకృష్ణ ఆధ్వర్యంలో పశ్చిమ ఏసీపీ విభు కృష్ణ, కొత్తపేట ఇన్స్పెక్టర్ చిన్న కొండలరావు పోలీసు సిబ్బందితో కలిసి గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రోన్లను ఉపయోగించి పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి లేదా ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ, ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలకు రక్షణ, ఓటర్లకు భద్రత, ఎన్నికలకు ప్రశాంత వాతావరణం కల్పించడమే పోలీసు యంత్రాంగం ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

వీఐ నుంచి వాట్సాప్ బిజినెస్ సేవలు

విజయవాడ, మహానగర్

చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), పెద్ద వ్యాపార సంస్థలు తమ వినియోగదారులతో సులభంగా అనుసంధానం కావడానికి వీఐ బిజినెస్ కొత్తగా వాట్సాప్ బిజినెస్ సొల్యూషన్స్‌ను ప్రవేశపెట్టింది. ఎంఎస్ఎంఈలు వీఐ వెబ్‌సైట్ ద్వారా 15 నిమిషాల్లోనే ఆన్‌లైన్‌లో సేవలను ప్రారంభించుకోవచ్చు. బల్క్ మెసేజ్‌లు, ప్రమోషనల్ అలర్ట్‌లు, ఇంటరాక్టివ్ టెంప్లేట్లు, కస్టమర్ స్పందన విశ్లేషణ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. పెద్ద సంస్థల కోసం ఏఐ ఆధారిత ఆటోమేషన్, చాట్‌బాట్‌లు, వ్యక్తిగతీకరించిన సేవలు, వాట్సాప్ వాయిస్ కాలింగ్‌తో పాటు ప్రత్యేక మెటా సపోర్ట్‌ను అందిస్తోంది. ఇప్పటికే ఉన్న ఎస్ఎంఎస్, వాయిస్, ఈమెయిల్ సేవలతోనూ వీటిని అనుసంధానించవచ్చు. కస్టమర్లతో వ్యాపార సంబంధాలను మరింత సమర్థవంతంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వొడాఫోన్ ఐడియా చీఫ్ ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ ఆఫీసర్ ఎం.పి. సునీల్ కుమార్ తెలిపారు.

600 మండల పరిషత్‌లకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు పూర్తి

59 మండలాల్లో పెండింగ్

శుక్రవారం ఉదయం 11 గంటలకు మిగిలిన ఎన్నికలు

అమరావతి, మహానగర్



రాష్ట్రంలోని 659 మండల ప్రజా పరిషత్‌లకు నిర్వహిస్తున్న అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం నాటికి 600 మండలాల్లో ఎన్నికలు పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. మరో 59 మండల ప్రజా పరిషత్‌లలో ఎన్నికల ప్రక్రియ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. వీటిలో 34 మండలాల్లో అధ్యక్ష ఎన్నికలు, 59 మండలాల్లో ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్నికలను శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, ఏలూరు, కృష్ణా, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, తిరుపతి జిల్లాల్లోని పలు మండలాల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు పెండింగ్‌లో ఉండగా, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోనూ కొన్ని మండలాల్లో ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు.

ఎంపీపీగా లంకమ్మ ప్రసాద్

అవనిగడ్డ, మహానగర్



మండల నూతన ఎంపీపీ పండ్రాజు లంకమ్మ ప్రసాద్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్వగృహంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జనసేన పార్టీ మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ లంకమ్మ ప్రసాద్ వారిని సత్కరించి ధన్యవాదములు తెలిపారు.

కోడూరు ఎంపీపీగా రెడ్రౌతు కృష్ణబాబు

కోడూరు, మహానగర్



మండల నూతన మండల పరిషత్ అధ్యక్షునిగా రెడ్రౌతు కృష్ణబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తనకు ఎంపీపీగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణబాబును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ సత్కరించారు.

ఘనంగా జాప్ 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కేక్ కటింగ్, సుమారు 200 మందికి అన్నదానం

బేబీమ్మ ట్రస్ట్ సహకారంతో కార్యక్రమాలు



విజయవాడ, మహానగర్

జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జాప్ వ్యవస్థాపకుడు, మాజీ ప్రెస్ కౌన్సిల్ సభ్యుడు, అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఉప్పల లక్ష్మణ్ సారథ్యంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బందరు రోడ్డులోని గోశాల సెంటర్ వద్ద ఠాగూర్ ఎస్టేట్‌లో బేబీమ్మ ట్రస్ట్ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించారు. ఇంటి వంటకాలతో స్వీట్లు, హాట్ వంటకాలను ఏర్పాటు చేసి, పచ్చని తోటలో ఆహ్లాదకరమైన వాతావరణంలో విందు అందించారు. కార్యక్రమానికి హాజరైనవారు జాప్‌కు శుభాకాంక్షలు, ఆశీస్సులు అందజేశారు. జాప్ ఎన్టీఆర్ జిల్లా సభ్యులతో పాటు బేబీమ్మ ట్రస్ట్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వివరాలను జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్టీఆర్ జిల్లా సభ్యుడు సత్యనారాయణ వెలివెల వెల్లడించారు.

వైద్య చికిత్స కోసం ఎల్ఓసీలు అందజేత

విజయవాడ, మహానగర్



ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన రూ.15.05 లక్షల విలువైన ఎల్ఓసీలను గురువారం అందజేశారు. భవానీపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నాయకులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు వీటిని అందించారు. కేదారేశ్వరపేటకు చెందిన గుర్రం సుజాత (62) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, చికిత్స కోసం రూ.9.55 లక్షలు మంజూరయ్యాయి. అదే ప్రాంతంలోని 57వ డివిజన్‌కు చెందిన షేక్ బుషీరా బేగం (49)కు పిత్తాశయంలో రాళ్ల సమస్యకు చికిత్స నిమిత్తం రూ.5.50 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. కార్యక్రమంలో కూటమి నాయకులు దాడి అప్పారావు, బొల్లేపల్లి కోటేశ్వరరావు, గాలేటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

స్టాక్ మార్కెట్లలో బుల్ రన్..
83,000 దాటిన సెన్సెక్స్, నిఫ్టీ జోరు!

సెన్సెక్స్ 989 పాయింట్లు పెరిగి 83,021 వద్ద ముగింపు
286 పాయింట్ల లాభంతో 25,514కు చేరిన నిఫ్టీ
ఆటో రంగం జోరు.. 4 శాతానికి పైగా పెరిగిన నిఫ్టీ ఆటో సూచీ
సరికొత్త ఆల్‌టైమ్ హై 63,053.25ను తాకిన నిఫ్టీ బ్యాంక్
విదేశీ పెట్టుబడులు, ముడిచమురు ధరల తగ్గింపు మార్కెట్లకు ఊతం



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో దూసుకెళ్లాయి. ఆటోమొబైల్, బ్యాంకింగ్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్ల మద్దతుతో ప్రధాన సూచీలు ఒక శాతానికి పైగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ ఏకంగా 989.94 పాయింట్లు (1.21 శాతం) ఎగబాకి 83,021.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 286.35 పాయింట్లు (1.14 శాతం) లాభపడి తిరిగి 25,514.30 స్థాయిని చేరుకుంది. ఆటో రంగ షేర్లు మార్కెట్ ర్యాలీకి ప్రధాన చోదక శక్తిగా నిలిచాయి. నిఫ్టీ ఆటో సూచీ ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 4 శాతానికి పైగా పెరిగి ట్రెండ్‌ను నడిపించింది. మారుతి సుజుకి, ఐషర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు భారీ లాభాలతో ముందువరుసలో నిలిచాయి. అటు బ్యాంకింగ్ రంగం సైతం సరికొత్త చరిత్ర సృష్టించింది. నిఫ్టీ బ్యాంక్ సూచీ జీవితకాల గరిష్ఠ స్థాయి 63,053.25ను తాకి సరికొత్త రికార్డు నమోదు చేసింది. పీఎస్‌యూ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) నిరంతర పెట్టుబడులు, అంతర్జాతీయంగా తగ్గుముఖం పట్టిన ముడిచమురు, రాగి ధరలు భారత మార్కెట్లకు బలమైన మద్దతుగా నిలిచాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల ఆందోళనలతో ఐటీ రంగం కాస్త ఒత్తిడికి లోనైనప్పటికీ, దేశీయ డిమాండ్‌తో ముడిపడి ఉన్న రంగాలపై మదుపర్లు ఆసక్తి చూపించారు. సాంకేతికంగా నిఫ్టీ 25,500 స్థాయిని దాటి నిలకడగా కొనసాగితే రాబోయే రోజుల్లో 25,800 నుంచి 26,000 స్థాయిలను తాకే అవకాశం ఉందని, కింద వైపు 25,400 స్థాయి తక్షణ మద్దతుగా పనిచేస్తుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రూ.7.5 లక్షల కోట్ల పండగ

పెళ్లిళ్ల సీజన్‌లో భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త జోష్!

నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు 52 లక్షల వివాహాలు
దేశవ్యాప్తంగా రూ.7.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని సీఏఐటీ వెల్లడి
ఒక్క ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనే రూ.2.5 లక్షల కోట్ల మేర లావాదేవీల అంచనా
కొనుగోళ్లలో రూ.1.2 లక్షల కోట్లతో బంగారు ఆభరణాలదే అగ్రస్థానం
వేదికలు, హోటళ్లు, మండపాల ద్వారా మరో రూ.60 వేల కోట్ల ఆదాయం



భారతదేశంలో మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్ దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊపును తీసుకురానుంది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు కేవలం 25 రోజుల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా సుమారు 52 లక్షల వివాహాలు జరగనున్నాయని అంచనా. వీటి ద్వారా ఏకంగా రూ.7.5 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు నమోదవుతాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) అంచనా వేసింది. ఈ ముహూర్తాల సీజన్.. రిటైల్, తయారీ, ఆతిథ్యం, రవాణా రంగాలకు అతిపెద్ద చోదక శక్తిగా మారనుందని వ్యాపారుల సమాఖ్య వెల్లడించింది. పెళ్లిళ్లు కేవలం శుభకార్యాలుగానే కాకుండా వ్యాపారులు, తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, చేతివృత్తుల కళాకారులు, సేవా రంగాలకు అండగా నిలిచే భారీ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందాయని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ స్పష్టం చేశారు. ఒక్క ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోనే దాదాపు 5 లక్షల వివాహాలు జరగనుండగా, అక్కడ ఏకంగా రూ.2.5 లక్షల కోట్ల మేర వ్యాపారం సాగుతుందని అంచనా వేశారు. ఈ మొత్తం రూ.7.5 లక్షల కోట్ల ఖర్చులో సుమారు రూ.4 లక్షల కోట్లు (54 శాతం) వస్తువులు, రిటైల్ కొనుగోళ్ల ద్వారా సమకూరనుండగా.. సర్వీసుల రంగం రూ.3.45 లక్షల కోట్ల వాటాను దక్కించుకోనుంది. వినియోగ వ్యయంలో సింహభాగం ఆభరణాలు, దుస్తులదే కానుంది. బంగారం, వజ్రాభరణాల కొనుగోళ్లు రూ.1.2 లక్షల కోట్లకు చేరనుండగా, వస్త్ర శ్రేణి రూ.90,000 కోట్ల వాటాతో తర్వాతి స్థానంలో నిలిచింది. గిఫ్ట్‌లు, ఎలక్ట్రానిక్స్, ఫర్నిచర్, స్వీట్లు కూడా భారీగా అమ్ముడుపోనున్నాయి. సేవల విభాగంలో క్యాటరింగ్ రంగానికి రూ.75,000 కోట్లు, కల్యాణ మండపాలు, బాంక్వెట్ హాళ్లు, హోటళ్లకు మరో రూ.60,000 కోట్ల వ్యాపారం సమకూరనుంది. గత కొన్నేళ్లుగా వివాహ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తోంది. 2022లో రూ.3.75 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిమాణం ఏటేటా పెరుగుతూ ఈ ఏడాది రూ.7.50 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరింది. అంతేకాకుండా, ఈ సీజన్ ద్వారా దాదాపు 1.25 కోట్ల మందికి తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఆ బగ్ వల్లే అంత గందరగోళం..
మైక్రోసాఫ్ట్ వైఫల్యాన్ని ఒప్పుకున్న సత్య నాదెళ్ల

మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయంపై సీఈవో సత్య నాదెళ్ల విచారం
సమస్యను ముందే నివారించడంలో మరింత మెరుగ్గా ఉండాల్సిందన్న నాదెళ్ల
నిద్రాణంగా ఉన్న సాఫ్ట్‌వేర్ బగ్, భారీ ట్రాఫిక్ వల్లే సమస్య తలెత్తినట్లు వెల్లడి
టెస్టింగ్ దశలోనే లోపాన్ని గుర్తించి ఉండాల్సిందని నాదెళ్ల అంగీకారం
ఔట్‌లుక్, టీమ్స్, కోపైలట్, ఎంఎస్ 365 సేవలు దాదాపు రోజంతా స్తంభన



ఇటీవల మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవల్లో తలెత్తిన భారీ ప్రపంచవ్యాప్త అంతరాయంపై ఆ సంస్థ సీఈవో సత్య నాదెళ్ల విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో యూజర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఈ సమస్యను ముందే నివారించడంలో తాము మరింత మెరుగ్గా పనిచేసి ఉండాల్సిందని ఆయన అంగీకరించారు. సీఎన్‌బీసీతో మాట్లాడిన ఆయన.. సాఫ్ట్‌వేర్‌లో నిద్రాణంగా ఉన్న ఒక బగ్ ఒక్కసారిగా నిర్దిష్ట యూజర్ ట్రాఫిక్‌ను ఎదుర్కోవడంతోనే ఈ వ్యవస్థ కుప్పకూలిందని స్పష్టం చేశారు. టెస్టింగ్ ప్రక్రియలోనే ఇలాంటి లోపాలను గుర్తించడంలో విఫలమయ్యామని, ఒక చిన్న లోపం ప్రపంచవ్యాప్తంగా వ్యాపించకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుని ఉండాల్సిందని నాదెళ్ల పేర్కొన్నారు. గత వారం తొలుత ఔట్‌లుక్‌లో మొదలైన ఈ అంతరాయం.. ఆ తర్వాత క్రమంగా టీమ్స్, కోపైలట్, మైక్రోసాఫ్ట్ 365, షేర్‌పాయింట్, వన్‌డ్రైవ్ వంటి కీలక సేవలన్నింటికీ పాకింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారులు దాదాపు ఒక రోజుకు పైగా సేవలందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రాథమిక నివేదికల ప్రకారం ఈ ఏడాది మొదట్లోనే సిస్టమ్‌లోకి ప్రవేశించిన ఈ సాఫ్ట్‌వేర్ బగ్‌తో పాటు, విపరీతమైన ట్రాఫిక్, సర్వర్ సామర్థ్యం తగ్గడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని తేలింది. అయితే దీని వెనుక ఎలాంటి సైబర్ దాడి ఆనవాళ్లు లేవని సంస్థ స్పష్టం చేసింది. ఈ పరిణామం మొత్తం టెక్ పరిశ్రమ ఎదుర్కొంటున్న విస్తృత సవాలును ప్రతిబింబిస్తోందని నాదెళ్ల విశ్లేషించారు. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ద్వారా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, లోపాల గుర్తింపు వేగవంతమైనప్పటికీ.. ఆ ప్యాచ్‌లను అంతే వేగంగా పాత సాంకేతిక వాతావరణంలోకి చేర్చడం ఆపరేషనల్ రిస్క్‌లకు దారితీస్తోందని ఆయన హెచ్చరించారు. కొత్త అప్‌డేట్‌లను పాత వ్యవస్థలు తట్టుకోలేకపోవడం వల్ల ఇలాంటి అనుకోని సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

తొలి రోజే న్యూజిలాండ్ రివర్స్ ఎటాక్
బుమ్రా దెబ్బకొట్టినా నిలబడ్డ కివీస్ మిడిలార్డర్!

తొలి రోజు ఆట ముగిసేసరికి న్యూజిలాండ్ స్కోరు 243/5
నికోల్స్ 113 నాటౌట్, ఫిలిప్స్ 94 నాటౌట్‌గా క్రీజులో
ఆరో వికెట్‌కు అజేయంగా 173 పరుగులు రాబట్టిన జోడి
70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన కివీస్‌ను ఆదుకున్న బ్యాటర్లు
బేసిన్ రిజర్వ్‌లో నికోల్స్‌కు ఇది ఐదో టెస్టు శతకం



బేసిన్ రిజర్వ్ వేదికగా భారత్‌తో ప్రారంభమైన తొలి టెస్టులో హెన్రీ నికోల్స్ అజేయ సెంచరీ, గ్లెన్ ఫిలిప్స్ మెరుపు బ్యాటింగ్‌తో న్యూజిలాండ్ పటిష్ఠ స్థితికి చేరుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేపట్టిన కివీస్ జట్టు ఓ దశలో భారత పేసర్ల ధాటికి 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో నికోల్స్, ఫిలిప్స్ జోడి తిరుగులేని పోరాట పటిమను కనబరిచి అజేయంగా 173 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు 82 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగులు చేసింది. నికోల్స్ 221 బంతుల్లో అజేయంగా 113 పరుగులు సాధించాడు. ఈ మైదానంలో ఆడిన 15 ఇన్నింగ్స్‌లలో అతనికిది ఐదో టెస్టు సెంచరీ కావడం విశేషం. మరోవైపు ఫిలిప్స్ 182 బంతుల్లో 94 పరుగులతో నాటౌట్‌గా నిలిచి త్రుటిలో శతకం చేజార్చుకునే పరిస్థితికి చేరినా, క్రీజులో పాతుకుపోయాడు. వీరిద్దరూ ఆఖరి సెషన్‌లో వికెట్ పడకుండా 100కు పైగా పరుగులు జోడించి భారత బౌలర్లపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. వ్యక్తిగత స్కోరు 102 వద్ద నికోల్స్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ సమన్వయ లోపంతో నేలపాలు చేసి లైఫ్ ఇచ్చారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 17 ఓవర్లలో 52 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, అన్షుల్ కాంబోజ్ ఒక వికెట్, ఆకాశ్ దీప్ ఒక వికెట్ తీశారు. టామ్ బ్లుండెల్ వికెట్‌ను కాంబోజ్ తీసినప్పటికీ, ఆ తర్వాత భారత బౌలర్లు కివీస్ జోడీని విడదీయలేకపోయారు. వాషింగ్టన్ సుందర్, ప్రసిద్ధ్ కృష్ణ వికెట్లు తీయడంలో విఫలమయ్యారు. ప్రారంభంలో పైచేయి సాధించిన భారత్‌ను నికోల్స్, ఫిలిప్స్ దెబ్బకొట్టడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి మ్యాచ్ ఆసక్తికరంగా మారింది.

సిరాజ్‌ను అందుకే తుది జట్టు నుంచి తప్పించాం..
కోచ్ కోటక్ వివరణ!

సిరాజ్‌ను పక్కనపెట్టడం ఏమాత్రం తప్పు కాదన్న అసిస్టెంట్ కోచ్ కోటక్
పిచ్ పరిస్థితులు, ఐదు రోజుల ఆటను దృష్టిలో ఉంచుకునే జట్టు ఎంపిక
సిరాజ్ ప్రపంచ స్థాయి బౌలరే అయినా పరిస్థితుల కోసమే తప్పించామని వెల్లడి
గడ్డి పిచ్‌పై ఇద్దరు సీమ్, ఇద్దరు స్వింగ్ పేసర్లతో బరిలోకి దిగిన భారత్
కివీస్ టాప్ ఆర్డర్‌లో నలుగురు లెఫ్ట్‌హ్యాండర్లు ఉండటంతో సుందర్‌కు చోటు



న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్టులో స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను తుది జట్టు నుంచి తప్పించడంపై టీమిండియా అసిస్టెంట్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టతనిచ్చాడు. సిరాజ్ ప్రపంచ స్థాయి బౌలర్ అయినప్పటికీ, పిచ్ పరిస్థితులకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామన్నాడు. ఇందులో ఎలాంటి తప్పిదం లేదని అతడు గట్టిగా సమర్థించుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన కోటక్.. పేసర్ల ఎంపిక, జట్టు కూర్పు వెనుక ఉన్న వ్యూహాలను వివరించాడు. అనుభవజ్ఞుడైన సిరాజ్‌ను ఈ మ్యాచ్‌లో పక్కనపెట్టడం తప్పు కాదని కోటక్ స్పష్టం చేశారు. "నా దృష్టిలో ఇది ఏమాత్రం తప్పుడు నిర్ణయం కాదు. జట్టు యాజమాన్యం పిచ్ పరిస్థితులు, ప్రత్యర్థి బలాబలాలను అంచనా వేసి అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను బరిలోకి దించింది. ఇటీవల సిరాజ్ శ్రీలంకలో ఆడిన పరిస్థితులు వేరు, ఇక్కడి పరిస్థితులు వేరు. సిరాజ్‌కు ఎలాంటి సమస్యా లేదు. ఇది కేవలం పరిస్థితుల ఆధారంగా తీసుకున్న నిర్ణయం మాత్రమే" అని పేర్కొన్నారు. బేసిన్ రిజర్వ్ పిచ్‌పై దట్టమైన గడ్డి ఉండటం వల్ల వేగం, సీమ్, స్వింగ్ రాబట్టగల కాంబినేషన్‌కు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. ఇద్దరు సీమ్ బౌలర్లు, ఇద్దరు స్వింగ్ బౌలర్లు అవసరమనే ఉద్దేశంతోనే ఈ పేస్ దాడిని ఎంచుకున్నామన్నారు. కేవలం తొలి రోజు మాత్రమే కాకుండా ఐదు రోజుల ఆటను దృష్టిలో పెట్టుకుని బౌలర్లను ఎంపిక చేశామని వివరించారు. యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ వేగం తగ్గడంపై స్పందిస్తూ.. మూడో స్పెల్‌లో కాస్త వేగం తగ్గినా ఆరంభంలో మంచి వేగంతోనే బౌలింగ్ చేశాడని కోటక్ వెనకేసుకొచ్చారు. పిచ్‌పై గడ్డి ఉన్నప్పుడు బంతి నెమ్మదిగా వస్తే బ్యాటర్లకు షాట్లు ఆడే సమయం దొరుకుతుందని, అందుకే పేస్ చాలా కీలకమని పేర్కొన్నారు.

స్పోర్ట్స్

'టైమ్ 100 నెక్స్ట్-ఇండియా'
జాబితాలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ

మారుతున్న భారతదేశానికి వైభవ్ ప్రతీక అంటూ ఆయుష్మాన్ ప్రశంసలు
విభిన్నంగా ఆలోచించేవారికే భవిష్యత్తు సొంతమని పేర్కొన్న నటుడు
జాబితాలో నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్, చెస్ ఛాంపియన్ డి.గుకేశ్
క్రీడాకారులు సానియా మీర్జా, లవ్లీనా, మీరాబాయి చానులకు సైతం స్థానం
దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే 100 మందితో కూడిన ప్రత్యేక జాబితా




భారత క్రికెట్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును దక్కించుకున్నాడు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న 100 మంది అసాధారణ యువ నాయకులు, ఎదుగుతున్న ప్రతిభావంతులతో ప్రతిష్ఠాత్మక 'టైమ్' పత్రిక రూపొందించిన తొలి 'టైమ్ 100 నెక్స్ట్ - ఇండియా' జాబితాలో వైభవ్‌కు చోటు దక్కింది. ఈ సందర్భంగా ప్రముఖ బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా యువ బ్యాటర్‌ను ఆకాశానికెత్తుతూ ఒక ప్రత్యేకమైన నోట్‌ను రాశారు. వైభవ్ మారుతున్న నవ భారతానికి అసలైన ప్రతీక అని కొనియాడారు. మైదానంలో బ్యాట్ పట్టుకుని వైభవ్ బంతిని బాదుతున్నప్పుడు, విభిన్నంగా ఆలోచించే వారికే భవిష్యత్తు సొంతమని గుర్తుచేస్తాడని ఆయుష్మాన్ పేర్కొన్నారు. అతడు కేవలం క్రీడా విస్మయం మాత్రమే కాదని, అంతకుమించి ఎంతో విశిష్టమైన వ్యక్తిత్వమని ప్రశంసించారు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడని, ఏడాది వ్యవధిలోనే రికార్డు స్థాయి ప్రదర్శనలతో దూసుకుపోతున్నాడని గుర్తుచేశారు. ప్రతిభ అనేది ఎక్కడి నుంచైనా పుట్టుకొస్తుందని చెప్పడానికి వైభవ్ ప్రయాణమే నిదర్శనమని, అతడి విజయాలు కోట్ల మంది భారతీయులకు పెద్ద కలలు కనే ధైర్యాన్ని ఇస్తాయని ఆయుష్మాన్ కొనియాడారు. అతడి అసలైన విజయం పరుగులు చేయడంలో మాత్రమే కాదని, అసాధారణ స్థాయికి ఎదిగే స్వేచ్ఛ దొరికినప్పుడు ఏం జరుగుతుందో చూపించాడని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో వైభవ్‌తో పాటు భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, బాక్సర్ లవ్లీనా బోర్గొహైన్, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, ప్రపంచ చెస్ ఛాంపియన్ డి. గుకేశ్, మాజీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, భారత మహిళా హాకీ జట్టు గోల్‌కీపర్ సవితా పునియా, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేతలు విత్య రామ్‌రాజ్, కుకుమ్ మోహోద్ కూడా చోటు దక్కించుకున్నారు.

జీరో కట్స్‌తో సెన్సార్ పూర్తి చేసుకున్న సల్మాన్ ఖాన్ ‘మాతృభూమి’.. విడుదల ఎప్పుడంటే?



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన ‘మాతృభూమి’ (‘మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్’) చిత్రం సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఖ/ూ 16+ సర్టిఫికెట్ జారీ చేసింది. ఎలాంటి కట్స్ సూచించకుండానే సినిమాకు క్లియరెన్స్ లభించడం విశేషం. ఈ చిత్రం మొత్తం నిడివి 2 గంటల 34 నిమిషాల 12 సెకన్లుగా ఖరారైంది. తొలుత నవంబర్ 20న విడుదల చేయాలనుకున్నప్పటికీ, కొన్ని కారణాలతో వాయిదా పడింది. తాజాగా ఈ చిత్రాన్ని డిసెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. 2020 గల్వాన్ లోయ ఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. దేశ రక్షణ కోసం పోరాడే సైనికాధికారి కల్నల్ సంతోష్ బాబు పాత్రలో సల్మాన్ ఖాన్ నటించగా, కుటుంబ బాధ్యతలను నిలబెట్టే భార్య పాత్రలో చిత్రాంగదా సింగ్ కనిపించనున్నారు. వీరిద్దరి త్యాగం, భావోద్వేగాల చుట్టూ కథ సాగుతుంది. మొదట ఈ సినిమాను ‘బ్యాటిల్ ఆఫ్ గల్వాన్’ పేరుతో ప్రకటించగా, మార్చి 2026లో ‘మాతృభూమి’గా మార్చారు. ప్రభుత్వ ఒత్తిడితో స్క్రిప్ట్‌లో మార్పులు చేశారన్న వార్తలను సల్మాన్ ఖాన్ ఖండించారు.

‘దళపతి’ సీన్ రీక్రియేట్ చేసిన అనిల్ రావిపూడి



వినూత్న ప్రమోషన్లతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడంలో దర్శకుడు అనిల్ రావిపూడి ఎప్పుడూ ముందుంటారు. తాజాగా తన కొత్త సినిమా ‘జనవరి 12 విడుదల’ ప్రమోషన్లను కూడా అదే తరహాలో ప్రారంభించారు. ఈ సినిమాలోని పాటల సందడిని రేపటి నుంచి మొదలుకానుందని వినూత్నంగా ప్రకటించారు.
దళపతి సినిమాలోని ఇందుకోసం సూపర్‌స్టార్ రజనీకాంత్, శోభన నటించిన ‘దళపతి’ సినిమాలోని ఓ ఫేమస్ సన్నివేశాన్ని నటి కృతిశెట్టితో కలిసి రీక్రియేట్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయగా.. అది నెట్టింట వైరల్‌గా మారింది. ఇది చూసిన నెటిజన్లు ‘మళ్లీ కొత్త కాన్సెప్టా అనిల్ భయ్యా.. ఈ సారి రజనీసార్‌నే వాడేశారు’గా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కాగా ఇంతకముందు వివాహ భోజనంబు చిత్రంలోని సుత్తి వీరభద్రరావు, బ్రహ్మానందం మధ్య బీచ్‌లో జరిగే ఓ సన్నివేశాన్నిమ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్‌కుమార్‌తో రీక్రియేట్ చేశారు. వెంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ మూవీని సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మాస్ యాక్షన్ విందుతో బెల్లంకొండ ‘టైసన్ నాయుడు’ టీజర్.!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో, దర్శకుడు సాగర్ కె. చంద్ర తెరకెక్కిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘టైసన్ నాయుడు’. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో పవర్‌ఫుల్ లుక్‌తో కనిపించనున్నారు. నేహా శెట్టి, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో నరేష్, రావు రమేష్, సునీల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ‘మదరాసి రబ్బరు బొమ్మ’ పాటకు మంచి స్పందన లభించగా, తాజా టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. త్వరలోనే చిత్ర విడుదల తేదీపై మేకర్స్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

మెన్స్ డే స్పెషల్.. ‘రాపో23’ ప్రీ-లుక్ వైరల్!

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కెరీర్‌లోనే ఒక పెద్ద సాహసానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు హీరోగా అలరించిన ఆయన, ఇప్పుడు తొలిసారిగా కథ రాసి, దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న ‘రాపో23’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా, నియో-నోయిర్ శైలిలో రూపొందుతున్న ఈ సినిమాపై ఆరంభం నుంచే మంచి ఆసక్తి నెలకొంది.
నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం (ఇంటర్నేషనల్ మెన్స్ డే) సందర్భంగా రామ్ పోతినేని ఈ సినిమా నుంచి ఒక ఆసక్తికరమైన ప్రీ-లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. “ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్” అనే క్యాప్షన్‌తో వచ్చిన ఈ పోస్టర్‌లో రామ్ తనదైన శైలిలో, కొత్త లుక్‌తో కనిపిస్తూ అభిమానుల్లో జోష్ నింపారు. తన దారిని తానే ఎంచుకుంటూ, ప్రపంచాన్ని ఒంటరిగా ఎదుర్కొనే స్వతంత్ర వ్యక్తిగా ఈ పాత్రను ఆయన పరిచయం చేశారు. ఈ పోస్టర్ ద్వారా అందరికీ మెన్స్ డే విషెస్ చెప్పిన చిత్రబృందం, త్వరలోనే సినిమా ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ సినిమా టైటిల్ ఏంటి, టీజర్ ఎలా ఉండబోతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తుండగా, ఎస్. తిరునావుక్కరసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూస్తున్నారు. దర్శకుడిగా, నటుడిగా రామ్ పోతినేని ఈ సినిమాతో ఎలాంటి కొత్త అనుభూతిని పంచుతారో చూడాలి.



20 రోజులకే ఓటీటీలోకి వచ్చేసిన విశ్వక్ సేన్ ‘కల్ట్’ స్ట్రీమింగ్ ఎందులో అంటే?



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో నటించిన సైకలాజికల్ స్లాషర్ థ్రిల్లర్ ‘కల్ట్’ అనూహ్యంగా ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో విడుదలైన కేవలం 20 రోజులకే ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రావడం విశేషం. ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులో ఉంది. 2026 అక్టోబర్ 30న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, మిశ్రమ స్పందనల మధ్య థియేటర్ రన్ పూర్తి చేసుకున్న వెంటనే ఓటీటీలోకి అడుగుపెట్టింది. కథ విషయానికి వస్తే, ఒక భారీ పార్టీ వేదికగా మొదలైన సంబరం, వరుస హత్యలు మరియు ఉత్కంఠభరిత పరిణామాలతో ప్రమాదకరంగా మారుతుంది. ఆ పరిస్థితుల్లో డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు, అసలు మిస్టరీ ఏంటి అనే ఆసక్తికర అంశాలతో ఈ స్లాషర్ థ్రిల్లర్ సాగుతుంది. విశ్వక్ సేన్ సరసన గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్‌గా నటించగా, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, ప్రజ్ఞ కీలక పాత్రల్లో కనిపించారు. తరుణ్ భాస్కర్ సంభాషణలు అందించగా, రవి బస్రూర్ సంగీతం సమకూర్చారు. తారక్ సినిమాస్ ఎల్ఎల్పీ, వన్మయే క్రియేషన్స్ బ్యానర్లపై సందీప్ కాకరాల, కరాటే రాజు ఈ చిత్రాన్ని నిర్మించారు. థియేటర్లలో మిస్సయిన వారు లేదా కొత్త స్లాషర్ థ్రిల్లర్ జోనర్‌ను ఇష్టపడే ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999